
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 1 అక్టోబరు 2024



ఐస్‌క్రీమ్ తిని డబ్బులివ్వని పోలీసులు

▸▸ దాడి చేసిన చిరు వ్యాపారులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 30: ఐస్‌క్రీమ్‌లు తీసుకుని డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా తిరిగి బెదిరింపులకు దిగిన పోలీసులపై చిరు వ్యాపారులు దాడి చేశారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి విశాఖ ఆర్‌కే బీచ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం...అల్లూరి సీతారామరాజు జిల్లాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ రహీమ్ నగరానికి వచ్చాడు. నగర పరిధిలో హోంగార్డులుగా పనిచేస్తున్న మిత్రులు నూకరాజు, అనిల్‌తో కలిసి ఆదివారం రాత్రి ఆర్‌కే బీచ్‌కు వెళ్లాడు. ముగ్గురూ అక్కడ ఓ బండి వద్ద ఐస్‌క్రీమ్‌లు తీసుకున్నారు. డబ్బులు ఇవ్వలేదు. వర్తకుడు డబ్బులు అడగ్గా, తాము పోలీసులమంటూ మమ్మల్నే డబ్బులు అడుగుతావా...అంటూ బెదిరించారు. దీంతో అతను...పోలీసులు అయితే డబ్బులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించడంతో వాగ్వాదం మొదలైంది. అక్కడకు సమీపంలోని చిరు వర్తకులంతా ఐస్‌క్రీమ్ బండి యజమానికి మద్దతుగా నిలిచారు. గొడవ పెరగడంతో ఒక్కసారిగా పోలీసులపై మూకుమ్మడి దాడి చేశారు. ఈ సంఘటనలో రహీమ్, నూకరాజు, అనిల్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నైట్ డ్యూటీలోని త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన పోలీసులను ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. దాడి జరిగిన విషయం వాస్తవమేనని, కానీ ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని త్రీటౌన్ పోలీసులు వివరించారు.

ఆవు మృతికి కారణమైన ఐదుగురిపై సస్పెన్షన్ వేటు

▸▸ మరొకరికి షోకాజ్ నోటీసు జారీచేసిన జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆవు మృతికి కారణమయ్యారనే అభియోగంపై జీవీఎంసీకి చెందిన జంతు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఐదుగురిని కమిషనర్ పి.సంపత్‌కుమార్ సోమవారం సస్పెండ్ చేశారు. మరొకరికి షోకాజ్ నోటీసు జారీచేశారు. వివరాలిలా ఉన్నాయి. శివాజీపాలెం రోడ్డుపై సంచరిస్తున్న ఆవును జీవీఎంసీ జంతు సంరక్షణ కేంద్రం టాస్క్‌ఫోర్స్ ... మిగతా 6వ పేజీలో

ఫెడెక్స్ ఫ్రాడ్స్



సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడ

▸▸ పోలీస్/కస్టమ్స్ అధికారుల మంటూ వాట్సాప్ కాల్స్
▸▸ కొరియర్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారంటూ బెదిరింపు
▸▸ మనీ ల్యాండరింగ్‌లో కూడా ప్రమేయం ఉందంటూ...
▸▸ విచారణ పేరుతో హడావిడి
▸▸ కేసు నుంచి తప్పించాలంటే డబ్బులు పంపాలంటూ బ్లాక్‌మెయిల్
▸▸ అకౌంట్ నుంచి డబ్బులు లాక్కొని మోసం
▸▸ విద్యావంతులు, వ్యాపారులే టార్గెట్
▸▸ నగరంలో పెరుగుతున్న కేసులు
▸▸ అవగాహనతోనే అడ్డుకట్ట సాధ్యమంటున్న సైబర్ పోలీసులు

2020 నుంచి 2024 మధ్య సైబర్ కేసుల వివరాలు

అందిన ఫిర్యాదులు	14,000
నేరగాళ్లు దోచుకున్న మొత్తం సుమారు	రూ.130 కోట్లు
పోలీసులు రికవరీ చేసింది	రూ.25 కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. తాజాగా ఫెడెక్స్ కొరియర్ పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. పోలీస్ అధికారుల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని వాట్సాప్ కాల్స్ చేసి డ్రగ్స్ సరఫరా, మనీల్యాండరింగ్ కేసుల్లో ప్రమేయం ఉందంటూ బెదిరించి డబ్బులు దోచుకుంటున్నారు.

సైబర్ మోసాల అడ్డుకట్టకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నాసరే ఫలితం ఉండడం లేదు. గతంలో నిరక్షరాస్యులు, అమాయకులను టార్గెట్ చేసుకున్న సైబర్‌నేరగాళ్లు ఇప్పుడు విద్యావంతులను లక్ష్యంగా చేసుకుని కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. 2020 నుంచి ఇప్పటివరకూ సైబర్ మోసాలకు సంబంధించి నగర పోలీసులకు 14 వేలకుపైగా ఫిర్యాదులు అందాయి. ఆయా కేసుల్లో సుమారు రూ.130 కోట్లు వరకూ సైబర్ నేరగాళ్లు దోచుకోగా, పోలీసులు రూ.25 కోట్లు మాత్రమే రికవరీ చేయగలిగారు. సైబర్ మోసాలకు పాల్పడుతున్న వారంతా విదేశాల్లో ఉండడం, ఇంటర్నెట్ కాల్స్‌లో మాట్లాడుతుండడం, దేశవ్యాప్తంగా అమాయకుల పేర్లతో ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాలను వినియోగిస్తుండడంతో వారిని గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో 'ఫెడెక్స్ కొరియర్ ఫ్రాడ్స్' ఎక్కువగా ఉంటున్నాయి. ఫెడెక్స్ కొరియర్ పేరుతో జరిగే మోసాల్లో బాధితుడికి ముందుగా గుర్తుతెలియని ఫోన్ నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వస్తుంది. ఫోన్ లిఫ్ట్ చేయగానే...అవతలి వ్యక్తి 'నేను పోలీస్ అధికారి/కస్టమ్స్ అధికారిని మాట్లాడుతున్నానని' పరిచయం చేసుకుంటాడు. వాట్సాప్ డీపీ కూడా యూనిఫారంతో ఉన్న అధికారి ఫొటో ఉండడంతో నిజంగానే పోలీస్/కస్టమ్స్ అధికారి మాట్లాడుతున్నారని ఇవతలివారు నమ్మేస్తుంటారు. 'ఫెడెక్స్ కొరియర్స్‌లో మీ పేరు మీద ఒక పార్శిల్ ముంబై నుంచి తైవాన్‌కు వెళుతుండగా ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. అందులో మాదక ద్రవ్యాలు, నకిలీ పాస్‌పోర్ట్‌లు, క్రెడిట్ కార్డులు, కొంత నగదు ఉంది. దీన్ని కస్టమ్స్ అధికారులు క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారంటూ' చెబుతారు. తాను ఎలాంటి కొరియర్ బుక్ చేయలేదని బాధితుడు చెప్పినా సరే తమదైన శైలిలో బెదిరింపులకు గురిచేస్తారు. అప్పటికే సైబర్ నేరగాళ్లు ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ ద్వారా సేకరించిన బాధితుడికి సంబంధించిన పూర్తివివరాలు, చిరునామా, ఆధార్ కార్డు నంబర్ వంటి వివరాలను చెప్పడంతో నిజంగానే తన పేరు మీద ఎవరో డ్రగ్స్ సరఫరా చేయడమో, మనీల్యాండరింగ్ చేయడమో చేసి ఉంటారనే అనుమానం మొదలవుతుంది. కేసు దర్యాప్తు కోసం క్రైమ్‌బ్రాంచ్ అధికారులతో మాట్లాడాలని, వారు అడిగిన వివరాలన్నీ చెప్పి విచారణకు సహకరించాలని భయపెడతారు. బాధితుడికి అనుమానం రాకుండా పోలీసుల మాదిరిగా వాకీటాకీ శబ్దాలు వినిపిస్తారు. పార్శిల్‌లో వచ్చిన డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్ట్‌లు ఇతర వస్తువుల పేర్లను చెబుతూ కేసు నమోదు చేస్తామంటూ బెదిరిస్తారు. పై అధికారుల వద్దకు కేసు ప్రస్తావన తీసుకువెళ్లినట్టు, ఆ అధికారి బాధితుడిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని ఆదేశిస్తున్నట్టు సీన్ క్రియేట్ చేస్తారు. కానీ క్రైమ్ బ్రాంచి అధికారులుగా చెప్పుకుంటున్నవారు మాత్రం బాధితుడు విచారణకు సహకరిస్తున్నాడని, కేసు నమోదుచేయొద్దని ... మిగతా 6వ పేజీలో

ఎక్సైజ్ సిత్రాలు

తీవ్ర అవినీతి ఆరోపణలున్న అధికారికి కీలక పోస్టింగ్

▸▸ రెండు రోజుల క్రితం సాధారణ బదిలీలు
▸▸ అందులో భాగంగా గాజువాక ఇన్‌స్పెక్టర్‌గా ఎంఆర్‌వీ అప్పారావు నియామకం
▸▸ రాత్రికి రాత్రి ఆయన మార్పు
▸▸ కేసులు ఎదుర్కొంటున్న అధికారికి పోస్టింగ్
▸▸ చక్రం తిప్పిన కొంతమంది ప్రజా ప్రతినిధులు
▸▸ విస్తుపోతున్న అధికార వర్గాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎక్సైజ్ శాఖలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని బదిలీల్లో భాగంగా గాజువాక వంటి కీలక స్థానంలో వేయడం చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు శనివారం రాత్రి జరిగిపోయాయి. అందులో భాగంగా గాజువాకకు ఒక అధికారిని వేశారు. అయితే కొందరు కూటమి ప్రజా ప్రతినిధులు అమరావతిలో చక్రం తిప్పి తెల్లవారేసరికి ఆయన్ను మార్చేసి ఆరోపణలు ఉన్న అధికారికి పోస్టింగ్ వేయించారు.

ఎక్సైజ్‌లో ఆదాయపరంగా చూసుకుంటే గాజువాక రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంటుంది. ప్రభుత్వం కూడా ఇక్కడి నుంచి ఎక్కువ ఆదాయం ఆశిస్తుంది. అందుకే ఎంఆర్‌వీ అప్పారావు అనే అధికారిని గాజువాక స్టేషన్‌కు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. కొత్త అధికారులు అంతా సోమవారం విధుల్లో చేరాలని భావిస్తున్న తరుణంలో ఆదివారం ఉదయం మరో ఉత్తర్వు వెలువడింది. శ్రీకాకుళం జిల్లా పలాస మొబైల్ టీమ్‌లో ఉన్న సీహెచ్ నాగశ్రీనివాసరావును గాజువాక వేసి, అక్కడ విధుల్లో చేరాల్సిన ఎంవీఆర్ అప్పారావును అనకాపల్లికి మార్చేశారు. ఇది ఆ శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. నాగశ్రీనివాసరావుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై కేసులు కూడా నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆయన మద్యం దుకాణాలకు వెళ్లి అమ్మకాల ద్వారా వచ్చిన నగదును సొంతానికి వాడేసుకున్నారని, ప్రభుత్వానికి దొంగ చలానాలు సమర్పించారని ఉన్నతాధికారులకు కేసులు నమోదు చేశారు. ఈ విధంగా సూపర్ వైజర్లను బెదిరించి డబ్బులు తీసుకొని వాడేసుకున్నారని, దొంగ చలానాలు పెట్టారనే ఆరోపణలతో గోపాలపట్నం, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని ఆ శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. తొలి కేసు నమోదైనప్పుడు కొన్నాళ్లు జైలుకు కూడా వెళ్లి వచ్చారని చెబుతున్నారు. ఖమ్మంలో పనిచేసినప్పుడు పలువురి వద్ద కోట్ల రూపాయల అప్పు చేసి వివాదాల్లో ఇరుక్కున్నారు. అలాగే మద్యం విక్రయానికి లైసెన్స్‌లు తీసుకునేవారి నుంచి సుమారు కోటి రూపాయల వరకు అప్పులు చేసి తిరిగి చెల్లించలేదని ఆరోపణలు ఉన్నాయి. ఎన్ఏడీ సమీపాన ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకొని వారికి అద్దె చెల్లించలేదు. ఇల్లు ఖాళీ చేయలేదు. దాంతో ఆ యజమాని ఎక్సైజ్ అధికారుల వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నట్టు తెలిసింది. ఇలా తీవ్రమైన ఆరోపణలు, కేసులు ఉన్న ఆ అధికారి మహారాణిపేట సెంటర్ కావాలని అధికారులను కోరారు. అయితే ఆయన తమకు వద్దని ఆ ప్రాంతానికి చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు తిరస్కరించడంతో గాజువాక వేసినట్టు తెలిసింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన కొందరు కీలక నేతలు అమరావతిలో చక్రం తిప్పి నాగశ్రీనివాసరావుకు పోస్టింగ్ వేయించారని ప్రచారం జరుగుతోంది.

15 నాటికి విశాఖ విజన్-2029



▸▸ అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం
▸▸ 3, 4, 5 తేదీల్లో భాగస్వామ్యులతో సమావేశాలు
▸▸ ప్రజా ప్రతినిధులు సలహాలు, సూచనలు తీసుకుంటాం
▸▸ గోదావరి, వంశధార నదుల్లో రెండు రీచ్‌లు జిల్లాకు కేటాయింపు
▸▸ ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు బల్క్‌గా ఇసుక సరఫరా
▸▸ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా విశాఖ విజన్-2029 ప్రణాళికను అక్టోబరు 15వ తేదీకల్లా సిద్ధం చేయనున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ వెల్లడించారు. సోమవారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ రూపకల్పనతోపాటు విశాఖ జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీపై అన్ని శాఖలకు ఇప్పటికే దిశానిర్దేశం చేశామన్నారు. విశాఖ విజన్, స్వర్ణాంధ్ర విజన్‌ను మూడు విభాగాలుగా చేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రాథమిక సెక్టార్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలు, విద్య, ఆరోగ్యం, తదితర రంగాలు, సెకండరీ సెక్టార్‌లో పరిశ్రమల విస్తరణ, కొత్తవి ఏర్పాటు ప్రతిపాదనలు, ఏపీఐఐసీ భూములు వినియోగం, కొత్త పరిశ్రమలకు సరిపడా భూసేకరణ, మౌలిక వసతులు కల్పన, ... మిగతా 6వ పేజీలో

వీధి దీపాలు శతశాతం వెలగాల్సిందే

▸▸ నిర్వహణ ఏజెన్సీకి 15 రోజులు డెడ్‌లైన్
▸▸ కాంతి తక్కువ ఉన్నచోట దీపాలను కూడా మార్చాలి
▸▸ కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
▸▸ నగరంలో అర్ధరాత్రి కమిషనర్ ఆకస్మిక తనిఖీ


దగ్గరుండి మరమ్మతులు చేయిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి దీపాలు శతశాతం వెలగాల్సిందేనని, అందుకు 15 రోజులు గడువు ఇస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులకు డెడ్‌లైన్ విధించారు. వీధిదీపాల సమస్యపై 'నగరంలో అంధకారం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రచురించిన కథనంపై కమిషనర్ స్పందించారు. వీధి దీపాలను పరిశీలించేందుకు ఆదివారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఎయిర్‌పోర్టు నుంచి మారియట్ హోటల్ వరకూ జాతీయ రహదారిపై వీధి లైట్లు వెలగపోవడంతో నిర్వహణ ఏజెన్సీ ప్రతినిధులను అక్కడకు రావాలని ఆదేశించారు. వీధి దీపాలు వెలగకపోవడానికి గల ... మిగతా 6వ పేజీలో

అప్పన్నకు హుండీ ఆదాయం రూ.1.39 కోట్లు

▸▸ 53.2 గ్రాముల స్వర్ణం, 8.650 కిలోల వెండి ఆభరణాలు


హుండీల లెక్కింపులో సిబ్బంది

సింహాచలం, సెప్టెంబరు 30: సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామికి గడచిన 28 రోజుల్లో కానుకల రూపంలో సుమారు రూ.1.39 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో సోమవారం పరకామణిలో సిబ్బంది హుండీల లెక్కింపు చేపట్టారు. ఆలయంలోని 37 హుండీల ద్వారా రూ.1,39,44,045 నగదు లభించగా, 53.2 గ్రాముల స్వర్ణం, 8.650 కిలోల వెండి ఆభరణాల రూపంలో అప్పన్న ఖజానాకు జమ అయ్యాయి. ఇంకా 77 యుఎస్ డాలర్లు, 20 కెనడా డాలర్లు, 30 సింగపూర్ డాలర్లు, యుఏఈ, సౌదీ ఆరేబియా, మలేషియా, ఒమన్, కువైట్, నైజీరియా, తదితర దేశాల కరెన్సీ కూడా అప్పన్న ఖజానాకు సమకూరినట్టు అధికారులు ప్రకటించారు.

స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీగా ఏకే సక్సేనా బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఏకే సక్సేనా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 30: విశాఖ స్టీల్‌ప్లాంటు ఇన్‌చార్జి సీఎండీగా మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బ్లాస్ట్‌ఫర్నేస్-2 విభాగాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. ఆ తరువాత ఉక్కు పరిపాలనా భవనంలో డైరెక్టర్లు ఎకె.బాగ్చి (ప్రాజెక్టు), ఎస్‌సీ పాండే (పర్సనల్), గణేష్ (ఫైనాన్స్), జీవీఎన్ ప్రసాద్, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

రోడ్డెక్కిన డాక్‌యార్డు ఉద్యోగులు

వారి కుటుంబ సభ్యులు కూడా...

ఎస్‌బీసీ వంతెన పైనుంచి రాకపోకలకు అవకాశం కల్పించాలని డిమాండ్

▸▸ డాక్‌యార్డు ఎదుట వేలాది మంది ఆందోళన
▸▸ ఉదయం నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకూ కొనసాగిన నిరసన
▸▸ నేటి ఉదయం మళ్లీ కొనసాగిస్తామని ప్రకటన


డాక్‌యార్డు విజయనగరం గేటు వద్ద ఉద్యోగులు, కుటుంబాల ఆందోళన

మల్కాపురం, సెప్టెంబరు 30: సర్దార్ వల్లభాయ్‌పటేల్ వంతెనను మరమ్మతుల కోసం మూసివేసిన నేపథ్యంలో షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వంతెన పైనుంచి రాకపోకలకు తమకు అవకాశం కల్పించాలని కోరుతూ డాక్‌యార్డుకు చెందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వేలాది మంది సోమవారం ఉదయం ఆందోళనకు దిగారు. కాన్వెంట్ జంక్షన్ కూడలి-షీలానగర్ మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్‌యార్డు ఉద్యోగి దిలీప్‌కుమార్ మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం 7.30 గంటలకు పెద్దఎత్తున డాక్‌యార్డు విజయనగరం గేటు వద్దకు చేరుకున్నారు. ఉద్యోగులు నల్ల దుస్తులు ధరించగా, వారి కుటుంబాలకు చెందిన దాదాపు మహిళలు 'మా తాళిబొట్లు తెంచొద్దంటూ' నినాదాలు ... మిగతా 6వ పేజీలో

స్పెల్‌బీలో విజేతలకు బహుమతులు ప్రదానం



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, సెప్టెంబరు 30: సీతమ్మధార లోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వేదికపై ఎక్స్‌ట్రా స్కూల్, ఇంగ్లీష్ విజార్డ్స్ స్పెల్‌బీ సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా జాతీయ స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అనిర్‌బాన్ పాల్, జనరేషన్ యువ వ్యవస్థాపకులు బి.నరేష్‌కుమార్, ఉపాధ్యాయినులు పి.లలిత, సౌమ్య ప్రభల చేతుల మీదుగా విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్లు, మెడల్స్ ట్రోఫీలను అందచేశారు.టి.అనుకర్, ఎం.అనుష్కా, ఇసిత గుప్తలు మొదటి స్థానాలో నిలిచారు.

'తిరుపతి లడ్డూ వ్యవహారంపై స్వరూపానందేంద్ర మాట్లాడరేం?

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 30: తిరుమలలో లడ్డూ అపవిత్రం చేసిన అంశంపై కనీసం శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఎందుకు నోరు మెదపడం లేదని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామతీర్థంలో శ్రీరాముని విగ్రహ శిరచ్ఛేదం సమయంలోనూ స్వామిజీ స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2న ఉదయం 11 గంటలకు శారదాపీఠాధిపతి వీటిపై చర్చకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నికుంజ్, సురేష్, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, రాము, కృష్ణవేణి పాల్గొన్నారు.

జనసేన నేతల దీపారాధన

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 3: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద జనసేన ఆధ్వర్యంలో నిర్వహించినదీపారాధనలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష సంఘీభావంగా కూటమి నేతలు ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు దీపారాధన చేశారు.

పోలీసు కమిషనరేట్ 96 ఫిర్యాదులు

మహారాణిపేట, సెప్టెంబరు 30: పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 96 ఫిర్యాదులు వచ్చినట్టు కమిషనర్ శంఖ బ్రత బాగ్చీ తెలిపారు. అధికారులతో మాట్లాడి ఈసమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నగరానికి రాక రేపు

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల రెండో తేదీన నగరానికి రానున్నారు. ఉదయం 9.25 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న ఆమె అక్కడి నుంచి నేరుగా జీవీఎంసీ ఎదుట మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు చేరుకుంటారు. ఈ సందర్భంగా బీజేపీ అ నుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలో పాల్గొంటారు. అనంతరం మీడియాతో మాట్లాడనున్నారు.

రక్షణ గోడ నిర్మాణ పనులకు బ్రేక్

» మాధవధారలో అడ్డుకున్న స్థానికులు

మురళీనగర్, సెప్టెంబర్ 30; సింహాచల దేవస్థానం ఉప దేవాలయమైన మాధవధార పుణ్యక్షేత్రం వద్ద ఆరంభించిన రక్షణ గోడ పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. ఉడా ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం భూములకు రక్షణగా వైసీపీ ప్రభుత్వ హయాంలో గత ఏడాది ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాన్ని ఎంపీ విజయసాయి రెడ్డి ప్రారంభించారు. హనుమంతవాక తదితర ప్రాంతాల్లో కొంతవరకు ఈ గోడ పూర్తి చేశారు. అయితే, సింహాచలం దేవస్థానం కొండకు ఇటువైపు ఉన్న మాధవధార భూములకు రక్షణగా గోడ ఆరంభించేందుకు సోమవారం ఇక్కడకు చేరుకున్న దేవస్థానం సూపరింటెండెంట్ ఎ.త్రిమూర్తులు, అధికారులు, సిబ్బందిని ఇక్కడి మాధవధార గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామంలో చాలామేర భూములు తమవంటూ తమ వద్ద ఉన్న కొన్ని ఆధారాలు, కోర్టు కేసులో కాగితాలను చూపించి పనులు చేపట్టడానికి వీలు లేదని అడ్డుకున్నారు. దీంతో సూపరింటెండెంట్ త్రిమూర్తులు వారికి సర్దిచెప్పి, తమ దేవస్థానం లీగల్ సెల్‌లో విచారించిన తర్వాత ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తున్నట్టు వివరించారు. అయితే, విజయనగరం రాజుల నుంచి తమకు సంక్రమించిన భూములు కొందరి చేతుల్లో ఉన్నట్టు మాధవధార గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో వివాదం ఉండగా వాల్ కట్టమని, స్థానికుల స్థలాలను గుర్తించిన తర్వాత ముందుకు సాగుతాయని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. దీంతో తాత్కాలిక షెడ్డు, తీసుకువచ్చిన యంత్ర పరికరాలు వదిలేసి అధికారులు వెళ్లిపోయారు.



నిర్మాణ సామగ్రిని వదిలేసి వెళ్లిన అధికారులు

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు



మాట్లాడుతున్న నరసింగరావు

సిరిపురం, సెప్టెంబరు 30 : సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతి తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటున్నాయని, 1991 తరువాత సరళీకరణ విధానాల పేరుతో రెగ్యులర్ చేయడం నిలుపుదల చేశారన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకపోగా బేసిక్ పే కూడా చెల్లించడం లేదని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోతే, ఇక ప్రైవేట్ రంగంలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఊహించుకుంటేనే భయంగా ఉందన్నారు. కాగా అంతకముందు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్, సెంట్రల్ పార్కు మీదుగా భారీ ప్రదర్శన అనంతరం ధర్నా వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్ పి. వెంకటరెడ్డి, బి. జగన్, యు. రాజు, నూకరాజు, సుబ్బారావు, మణి, జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్, పోర్టు, రైల్వే, కోరమాండల్, ఆర్టీసీ, విశాఖ డెయిరీ, ప్రభుత్వ హాస్పటల్స్, 108, విద్యుత్, పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

'కిరండోల్'కు అదనపు విస్టాడమ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

విశాఖపట్నం, సెప్టెంబరు 30: ప్రయాణికుల రద్దీని దృష్ట్యా విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న 08551, 08552 నంబరు గల రైళ్లకు పరిమిత తేదీల్లో అదనంగా ఒక విస్టాడమ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలుకు (08551) ఈనెల 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19 తేదీల్లో... తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశాఖ రైలుకు (08552) ఈనెల 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20వ తేదీల్లో అదనంగా ఒక విస్టోడమ్ కోచ్ అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు. అలాగే విశాఖ- కిరండోల్ రైలుకు (08551) ఈనెల 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20వ తేదీల్లో...తిరిగి కిరండోల్-విశాఖ రైలుకు (08552) ఈనెల 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21 తేదీల్లో అదనంగా ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్టు వివరించారు.

క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి

» ఎమ్మెల్యే వంశీ కృష్ణ



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 30: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపేలా ఉపా ధ్యాయులు, తల్లిదండ్రులు వారి ని ప్రోత్సహించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. సోమవారంఎంవీడీఎం పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లో పలు పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటుచేసిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులో క్రమశిక్షణ అలవడుతుందన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ఎమ్మెల్యే క్రీడల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీలను ఆయన స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్. శేషకుమారితో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు కార్పొరేటర్ సాధిక్. కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూల్స్ ఫెడరేషన్ గేమ్స్ ప్రారంభం

సీతంపేట: మధురనగర్‌లోని మధురనగర్ జీవీఎంసీ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక సోమవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం శాంతికుమారి. పీటీ మాస్టర్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



జ్యోతి, పిల్లలు(ఫైల్)

పెందుర్తి, సెప్టెంబరు 30: పుట్టింటికి వచ్చి తిరిగి అత్తింటికి ఆటోలో బయలుదేరిన వివాహిత ఇద్దరి పిల్లలతో అదృశ్యమైంది. సీఐ కె. సతీశ్‌కుమార్ సోమవారం తెలిపిన వివరాలివి..గాజువాకలో నివాసముంటున్న కుదార సాయికుమార్‌తో పెందుర్తికి చెందిన జ్యోతి (24) కి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల దీక్షిత, ఏడాదిన్నర వయసు గల దిత్యశ్రీ కుమార్తెలున్నారు. జ్యోతి తల్లికి నేత్ర శస్త్రచికిత్స జరగడంతో సపర్యలు చేయడానికి పది రోజుల క్రితం పెందుర్తిలో టీటీడీసీ వెనుకన ఉన్న ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో తల్లి కోలుకోవడం తో సెప్టెంబరు 26వతేదీన జ్యోతి తన ఇద్దరి పిల్లలతో పెందుర్తి నుంచి అత్తింటికి గాజువాక ఆటోలో బయలుదేరింది. అయితే, వారు అత్తవారింటికి చేరలేదు. భార్య, పిల్లలు ఇంటికి రాకపోవడంతో భర్త సాయికుమార్ బంధువులు,స్నేహితుల ఇళ్లల్లో వెదికినా ఫలితం దక్కలేదు. దీంతో అదృశ్యంపై జ్యోతి అక్క శ్రావణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గెడ్డలో గుర్తుతెలియని మృతదేహం

సీతంపేట, సెప్టెంబరు 30: అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డు పుట్ట బంగారమ్మ తల్లి గుడి వద్ద గల గెడ్డలో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృత దేహం లభ్యమైంది. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఈ మృతదేహన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. వివరాలు తెలిసిన వారు ఫోన్: 9440796058కు సమాచారమివ్వాలని ఎస్‌ఐ కోరారు.

'జీవీఎంసీ ఉద్యోగుల నిర్లక్ష్యంతో జీతాలు జాప్యం'

మహారాణిపేట, సెప్టెంబరు 30: జీవీఎంసీ పరిధి వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలు బిల్లుల ప్రక్రియలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సంఘం నాయకులు కోరారు. సోమవారం జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జె. గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. జీవీఎంసీలో మోనటరింగ్ సెల్‌లో కొంతమంది ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా జీతాల బిల్లుల్లో తీవ్ర జాప్యమవుతుంద ఆరోపించారు. ఈ సమస్యయ పునరావృతం కాకుండా సదరు ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకాయల బంగార్రాజు, సందీప్, అశోక్ కుమార్, ఎస్. సాయికృష్ణ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కంచరపాలెం,సెప్టెంబరు 30: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని జీవీఎంసీ ఐదో జోన్ కమిషనర్ బి.రాము పేర్కొన్నారు. స్థానిక రైతుబజారులో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. జోన్ అధికారులతో కలిసి ఆయన బజారు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం రైతులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంహెచ్‌వో డా.సునీల్, బీజేపీ నాయకుడు ఆర్.రాంబాబు, బజారు ఎస్టేట్ అధికారి సీహెచ్.కృష్ణమూర్తితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రోగ్రాం అధికారి డాక్టర్ .కె .మాణిక్యకుమారి ఆధ్వర్యంలో సోమవారం జ్ఞానాపురం నుంచి ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టేషన్ మీదుగా డాబాగార్డెన్స్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు.

మాధవధార: ప్రజలంతా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ సీనియర్ స్టాటస్టికల్ అధికారి ఎస్.పల్లంరాజు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ జంక్షన్ అప్పయ్యనగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ఓ సబ్ రీజినల్ కార్యాలయం నుంచి ఉద్యోగులు సోమవారం 'స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత' ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ఉద్యోగులు

15 నాటికి విశాఖ విజన్-2029

... 5వ పేజీ తరువాయి

మూడో విభాగంలో ఐటీ, పర్యాటకం, అతిథ్య రంగాల అభివృద్ధికి అనువుగా విశాఖ విజన్-2029 రూపొందిస్తామన్నారు. ప్రతి ఏడాది 15 శాతం ఆర్థిక వృద్ధి వచ్చేలా ప్రణాళికల్లో లక్ష్యాలు పొందుపర్చుతామన్నారు. విశాఖ విజన్-2029, స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ తయారీపై అక్టోబరు 3,4,5 తేదీల్లో భాగస్వామ్యులతో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఇంకా ప్రజా ప్రతినిధుల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ కింద వచ్చిన దరఖాస్తులను అక్టోబరు 10వ తేదీలోగా పరిశీలించాలని అధికారులకు సూచించామన్నారు. ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో శాఖలు సాధించిన లక్ష్యాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. విశాఖ జిల్లా అవసరాలకు తగినంత ఇసుక కోసం గోదావరి, వంశధార నదుల్లో రెండు రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రస్తుతం రెండు నదుల నుంచి ఇసుక సరఫరాకు ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభమైందన్నారు. అయితే శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నదికి వరద కొనసాగుతున్నందున ఇసుక తవ్వకాలు నెమ్మదిగా సాగుతున్నాయన్నారు. నదిలో నీరు తగ్గిన తరువాత డిమాండ్‌కు తగిన ఇసుక లభ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ నిర్మాణాలు, ప్రైవేటు బిల్డర్లకు బల్క్‌గా ఇసుక అందిస్తున్నామని, తక్కువ మొత్తం ఇసుక అవసరమయ్యే వారికి సరఫరా చేసేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. నదుల నుంచి ఇసుక తీసుకువచ్చే లారీ ఆపరేటర్లకు 80 కిలోమీటర్లు దాటిన తరువాత కిలోమీటరుకు ఇచ్చే చార్జీ పెంచామన్నారు. అయితే రవాణా చార్జీలపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. నదుల్లో నీటి ప్రవాహం తగ్గిన తరువాత నగరానికి ఇసుక సరఫరా మరింత పెరుగుతుందని, ఇందుకు ఒకటి, రెండు వారాల సమయం పడుతుందన్నారు.

ఆవు మృతికి కారణమైన ఐదుగురిపై సస్పెన్షన్ వేటు

... 5వ పేజీ తరువాయి

బృందం మూడు రోజులు కిందట పట్టుకుంది. వాహనంలో ఆరిలోవలోని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించింది. అయితే చూడి (గర్భం)తో ఉన్న ఆవుకు సంరక్షణ కల్పించాల్సిన సిబ్బంది ఎలాంటి ఆహారం అందించకుండా వదిలేశారు. దీంతో ఆవు సోమవారం తెల్లవారుజామున సంరక్షణ కేంద్రంలో మృతిచెందింది. దీనిపై జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌కు ఆవు యజమాని ఫిర్యాదు చేశారు. అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుని, ఆవు యజమానికి న్యాయం చేయాలని మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ జంతు సంరక్షణ కేంద్రానికి వెళ్లి విచారణ నిర్వహించారు. ఆవు మృతికి బాధ్యులనే అభియోగంపై వాహనం డ్రైవర్ యు.రమణ, జంతువుల క్యాచర్లు కె.నర్సింగరావు, ఎస్.లక్ష్మణ్, బిసంతోష్‌కుమార్, కె.శ్రీనులను విచారణ పూర్తయ్యేంత వరకూ విధుల నుంచి సస్పెండ్ చేశారు. వీహెచ్ మేస్త్రీగా పనిచేస్తున్న కె.లక్ష్మణరావుకు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఆవు యజమానికి జీవీఎంసీ తరఫున రూ.40 వేలు పరిహారం అందజేశారు.

వినతులను సత్వరం పరిష్కరించాలి

» ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుం చి వచ్చే ప్రతి వినతినీ పరిష్కరించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 303 వినతు లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్,ఇతర అధికారులుపాల్గొన్నారు.

శాంతి ఆశ్రమ భూములు కాపాడండి

భూ కబ్జాదారుల గుప్పిట్లో చిక్కుకున్న శాంతి ఆశ్రమ భూములను పరిరక్షించాలని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. చిన్నవాల్తేరు శాంతి ఆశ్రమం వద్ద పదెకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకోవడంతో కోర్టును ఆశ్రయించడంతో, శాంతి ఆశ్రమానికి అనుకూలంగా తీర్పునిస్తూ సెప్టెంబరు 30లోగా భూములను ఆశ్రమానికి అప్పగించాలని ఆదేశించిందన్నారు.

లాడ్జి నిర్మాణం నిలిపివేయాలి

గ్రేటర్ 29వ వార్డులో నివాసగృహాల మధ్య లాడ్జి నిర్వహణ కోసం బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, దానిని నిలిపివేయాలని కృష్ణానగర్ వాసులు కోరారు.

కేసు కోర్టులో ఉండగా ల్యాండ్ పూలింగ్ సర్టిఫికెట్లు జారీ చేశారని దువ్వి అవన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భీమిలి మండలం అన్నవరం గ్రామానికి చెందిన 8.5 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వమని ప్రభుత్వం కోరిందని, దీనిపై హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు కేసులో ఉన్న భూమికి కొంతమంది వ్యక్తుల పేరిట ల్యాండ్‌పూలింగ్ సర్టిఫికెట్ ఇవ్వడం చట్ట వ్యతిరేకమని, హక్కులు కల్పించాలని కోరారు.

మత్స్యకారుల భద్రతకు సాంకేతిక పరికరాలు

» ఎంపీ శ్రీభరత్



సాంకేతిక పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీ

మహారాణిపేట, సెప్టెంబరు 30: సముద్రంలో చేపలు పట్టే మత్స్యకారులకు సురక్షిత నేవిగేషన్ కమ్యూనికేషన్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్టు ఎంపీ ఎం. శ్రీభరత్ తెలిపారు. సోమవారం ఫిషింగ్ హార్బర్‌లోని న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభు త్వం అందించిన వెసెల్ కమ్యూనికేషన్ సిస్టం పరికరం అమర్చే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వీసీఎస్ ద్వారా నడి సముద్రంలో రెండు వైపులా సంభాషణ చేసుకోవచ్చన్నారు. అత్యవసర సమయంలో మత్స్యకా రులకు సులభంగా అర్థమయ్యేలా ఇంటం ఫేస్ జియో ఫెన్సింగ్ సిస్టం ద్వారా వాతావరణ హెచ్చరికలు అందజేస్తారని చెప్పారు. చేపల వేట సమయంలో మత్స్యకారులు ఇబ్బందులకులోనైతే, ఉపయోగించే నేవిగేషన్ పరికరాల్లో ఎన్నో ప్రత్యేకతలున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు సామాజిక పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నారు. ఉదయం 5.30 గంటల నుంచి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లుచేశారు. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో సిబ్బందికి పింఛన్ల సొమ్ము అందజేశారు. జిల్లాలో 1,62,490 మందికి రూ. 69,80, 10,500లు పంపిణీచేస్తారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,948 మందికి రూ. 11, 20, 64, 500లు, జీవీఎంసీలో 1,35,542మందికి రూ. 58,60,36,000 చెల్లిస్తారు.

ఫెడెక్స్ ఫ్రాడ్స్

... 5వ పేజీ తరువాయి

ఏదోలా అతన్ని కేసు నుంచి బయటపడేలా చూడాలని ఉన్నతాధికారిని విజ్ఞప్తి చేస్తున్నట్టు నటిస్తారు. ఆ సమయంలో ఉన్నతాధికారులుగా నటించే వ్యక్తులు కూడా 'సరే ఏదోలా చేసేయ్' అని అవకాశం ఇచ్చినట్టు వదిలేస్తారు. వెంటనే బాధితుడికి స్కైప్ లేదా వాట్సాప్ వీడియోకాల్ చేసి కేసు విచారణ విషయాన్ని కుటుంబ సభ్యులకు కూడా చెప్పొద్దని, బయటకు పొక్కితే తాము సాయం చేయలేమని బాధితుడిని బెదిరిస్తారు. తర్వాత పోలీస్/కస్టమ్స్ విచారణలో భాగంగా బ్యాంకు ఖాతాలోని నగదును తాము చెప్పిన ఖాతాకు బదిలీ చేయాలని, విచారణ తర్వాత 20నిమిషాల్లో తిరిగి అదే ఖాతాకు జమ అయిపోతుందని చెబుతారు. దీనికి సంబంధించి ఆర్‌బీఐఅనుమతి ఇచ్చిందంటూ నకిలీ ఆర్డర్ కాపీని బాధితుడికి పంపిస్తారు. నిజమేనని భావించిన బాధితుడు తన ఖాతాలోని నగదుని సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాకు బదలాయించగానే సైబర్ నేరగాళ్లు లైన్‌లన్నీ కట్ చేసేస్తారు.

ఈ తరహా మోసాలు నగరంలో పెరుగుతుండడం పోలీసులను సైతం కలవరపాటుకు గురిచేస్తోంది. ఇటీవల నగరానికి చెందిన ఒక లాజిస్టిక్ వ్యాపారికి ఇలాంటి ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబై కస్టమ్స్ అధికారులమని పరిచయం చేసుకుని 'మీ పేరు మీద తైవాన్‌కు ఫెడెక్స్‌లో ఒక కొరియర్ బుక్ చేశారని' చెప్పారు. తాను ఎలాంటి కొరియర్ పంపించలేదని లాజిస్టిక్ వ్యాపారి చెప్పగా, అవతలి వ్యక్తులు వ్యాపారి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, కార్యాలయం వివరాలతో సహా ఏకరువుపెట్టడంతో నిజమేనని భావించారు. కొరియర్ బుకింగ్ నంబర్ చెప్పి అందులో నిషేధిత నార్కోటిక్ డ్రగ్స్‌తోపాటు నకిలీ పాస్‌పోర్టులు, క్రెడిట్ కార్డులు ఉన్నాయని చెప్పడంతో వ్యాపారి భయపడిపోయారు. విచారణకు సహకరిస్తే కేసు లేకుండా బయటపడేలా చేస్తామంటూ సైబర్ నేరగాళ్లు బాధితుడికి చెప్పారు. దీంతో వారు చెప్పినట్టే బాధితుడు తన ఖాతాలోని రూ.1.3 కోట్లను సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. వెంటనే ఫోన్ కట్ అవ్వడంతో బాధితుడు అనుమానంతో సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి విషయం చెప్పారు. సైబర్‌క్రైమ్ పోలీసులు అప్రమత్తమై బ్యాంకు అధికారులతో మాట్లాడి బాధితుడి ఖాతా నుంచి నగదు వెళ్లిన సైబర్ నేరగాళ్ల ఖాతాను ఫ్రీజ్ చేసి అందులో అప్పటికి ఉన్న రూ.85,70,923ని హోల్డ్‌లో పెట్టించారు. రెండు రోజుల కిందట ప్రైవేటు ఉద్యోగి ఒకరికి గుర్తుతెలియని రెండు నంబర్ల నుంచి వరుసగా వాట్సాప్ కాల్స్ వచ్చాయి. పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తుల ఫొటోలు డీపీలుగా ఉన్నాయి. కానీ ఫోన్ నంబర్ సిరీస్ +92తో ఉండడంతో సైబర్ నేరగాళ్లు అయివుంటారని అనుమానించి ఆయన ఫోన్ లిఫ్ట్‌చేయలేదు. దీనిపై సైబర్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా ఆ రెండు నంబర్లు కూడా సైబర్ నేరగాళ్లవేనని నిర్ధారించారు. ఇలాంటి కేసులు చాలా ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు.

అవగాహనతోనే నేరాలకు అడ్డుకట్ట

కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు ప్రజలను బురిడీ కొట్టించేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తుంటారు. ప్రస్తుతం ఫెడెక్స్ కొరియర్, టాస్క్ బేస్డ్ ఫ్రాడ్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్స్ హనీట్రాప్ వంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీసులు/కస్టమ్స్ అధికారులు ఏదైనా కేసు ఉంటే ఫోన్‌లో విచారణ చేయరని గుర్తించాలి. ఏదైనా ఉంటే ముందుగా నోటీసు ఇచ్చి తర్వాత ప్రత్యక్షంగా విచారిస్తారు తప్పితే వాట్సాప్ కాల్ చేసి విచారణ చేయరు. అలాగే బ్యాంకు ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని అడిగే ప్రసక్తే ఉండదు. బాధాకరమైన విషయం ఏమిటంటే సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్న వారంతా విద్యావంతులు, ఉన్నతస్థానాల్లో ఉన్నవారే ఉంటున్నారు. ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడు మాత్రమే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

రోడ్డెక్కిన డాక్‌యార్డు ఉద్యోగులు

... 5వ పేజీ తరువాయి

చేశారు. నేవీకి చెందిన ఎస్‌బీసీ వంతెన ఉండగా...చుట్టూ తిరిగి వెళ్లాల్సిన కర్మ ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా ప్రయాణించడంతోనే దిలీప్‌కుమార్ ప్రాణాలు కోల్పోయారని, ఆయన భార్య, ఆరు నెలల బిడ్డ అనాథలయ్యారన్నారు. అలాంటి పరిస్థితి మరొకరికి రాకూడదన్నారు. ఎస్‌బీసీ వంతెన పైనుంచి ఉద్యోగుల రాకపోకలకు అంగీకరించేంత వరకూ కదిలేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, నగర పోలీసు కమిషనర్ వచ్చి వంతెన పైనుంచి రాకపోకలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాదని తమను బలవంతంగా తరలించాలని చూస్తే ఆత్మాహుతి చేసుకుంటామని హెచ్చరించారు. పరిశ్రమలో ఉన్నవారిని బయటకు..వెలుపల ఉన్న వారిని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దాదాపు పది వేల మందికిపైగా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ నిరసన సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగింది. తిరిగి మంగళవారం కొనసాగిస్తామని తెలిపారు.

ఎన్ని వినతులిచ్చినా ఫలితంలేకపోయింది..

డాక్‌యార్డులోకి అనుసంధానంగా ఉన్న ఎస్‌బీసీ వంతెన పైనుంచి రాకపోకలకు అవకాశం కల్పించాలని కోరుతూ అనేకసార్లు జిల్లా ఉన్నతాధికారులు, ఎంపీలు, కేంద్ర మంత్రులకు వినతి పత్రాలిచ్చినా ఫలితం లేకుండా పోయిందని డాక్‌యార్డు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే తాము ఆందోళన చేపట్టాల్సి వచ్చినట్టు చెప్పారు.

స్పృహ కోల్పోయిన కానిస్టేబుల్

డాక్‌యార్డు ఉద్యోగులు చేపడుతున్న ఆందోళన కార్యక్రమం వద్ద బందోబస్తుకు వచ్చిన మల్కాపురం స్టేషన్ కానిస్టేబుల్ ఎండ తీవ్రతకు స్పృహతప్పిపడిపోయారు. వెంటనే అక్కడ ఉన్న ఉద్యోగులు, పోలీసు సిబ్బంది సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉంది.

వీధి దీపాలు శతశాతం వెలగాల్సిందే

... 5వ పేజీ తరువాయి

కారణాలపై ఆరా తీశారు. స్విచ్ బాక్స్‌ల్లో సమస్య ఉన్నట్టు ఏజెన్సీ ప్రతినిధి ఒకరు చెప్పడంతో దానిని తెరిచి సమస్యను గుర్తించాలని ఆదేశించారు. అక్కడి నుంచి అక్కయ్యపాలెం, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, బీచ్‌రోడ్డులో వీధి దీపాలను పరిశీలించారు. బీచ్‌రోడ్డులో వీధి దీపాల నుంచి తక్కువ కాంతి వస్తుండడంతో అక్కడ పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను సరైన వెలుతురు లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రజలకు జీవీఎంసీ కల్పించాల్సిన మౌలిక సదుపాయాల్లో వీధి దీపాలు ప్రధానమైనవన్నారు. అయితే ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఆ సదుపాయాన్ని కల్పించలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులతోపాటు ఎమ్మెల్యేలు కూడా వీధి దీపాల సమస్యను ప్రస్తావించారని, అసలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే ఒక నోటీసు జారీ చేశామని, 15 రోజుల్లోగా పూర్తిస్థాయిలో వీధి దీపాలను వెలిగించాల్సిందేనని స్పష్టం చేశారు. కొత్తగా వీధి దీపాలు ఏర్పాటుచేయాల్సిన ప్రాంతాలపై జీవీఎంసీ, పోలీస్ శాఖ సంయుక్తంగా ఒక జాబితా ఇచ్చినందున 30 రోజుల్లోగా అక్కడ అమర్చాలని ఆదేశించారు. కాంతి తక్కువగా ఉన్న చోట ప్రకాశవంతమైన వీధి దీపాలను ఏర్పాటుచేసేందుకు 45 రోజులు గడువు ఇస్తున్నట్టు చెప్పారు. ఇకపై రోజు విడిచి రోజు వీధి దీపాల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తానని, తేడా వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఇంజనీరింగ్ అధికారులతోపాటు ఏజెన్సీ ప్రతినిధులను హెచ్చరించారు.



జారిపోతున్నారు.. జాగ్రత్త!

ప్రమాదకరంగా మారిన కాన్వెంట్-షీలానగర్ రహదారి

- తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఇప్పటికే పలువురు మృత్యువాత..
- ఎంతోమంది క్షతగాత్రులుగా మారిన వైనం

మల్కాపురం, సెప్టెంబరు 30: కాన్వెంట్ వంతెన నుంచి షీలానగర్ రహదారిపై వెళ్తున్నారా..? జాగ్రత్త జారిపడే అవకాశముంది. ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ జారిపడిన సంఘటనల్లో గతంలో కొంతమంది మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా శుక్రవారం రాత్రి ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్‌యార్డు ఉద్యోగి దిలీప్ మృతి చెందారు. ఇక క్షతగాత్రుల సంఖ్య చెప్పనవసరం లేదు. ఈ మార్గంలో ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చినుకు పడినా, దట్టంగా మంచు కురిసినా ఈ రోడ్డుపై ప్రయాణం కత్తిమీద సామే. వర్షం కురిస్తే చాలు రహదారిపై నల్లటి బురద పేరుకుపోతుంది. దీంతో వాహనచోదకులు జారిపడుతున్నారు. పోర్టు జట్టీకి నౌకల ద్వారా తీసుకువచ్చిన ముడిసరకును భారీ వాహనాల్లో ఈ వంతెనపై నుంచే తరలిస్తుంటారు. రవాణా సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో ముడిసరకు రోడ్డుమీద పడి ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ రోడ్డులోప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులు అనేక చర్యలు చేపడుతున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో పోలీసులు ఒకపక్క ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూనే.. మరోపక్క రోడ్డుమీద పడిన వాటిని తొలగించే పనిలో ఉంటున్నారు. అయినప్పటికీ ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం డాక్‌యార్డు వద్ద ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను మూసివేయడంతో ఈ రహదారిలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీనికి తోడు రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదు. ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులతో పాటు వాహన చోదకులు కోరుతున్నారు.



సెప్టెంబరు 27న జరిగిన ప్రమాదంలో మృతి చెందిన డాక్‌యార్డు ఉద్యోగి దిలీప్ (ఫైల్)



ప్రమాదాలకు నిలయంగా మారిన కాన్వెంట్ వంతెన రోడ్డు. (ఇన్‌సెట్లో) బురదమయంగా ఉన్న రహదారి



మళ్ల విజయప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న వైసీపీ శ్రేణులు

మళ్ల విజయప్రసాద్‌కు స్వాగతం

గోపాలపట్నం, సెప్టెంబరు 30: వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తర్వాత తొలిసారిగా నగరానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌కు విమానాశ్రయంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం ఉదయం హైద రాబాద్ నుంచి నగరానికి చేరుకున్న ఆయనకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి స్వాగతించారు.

ఆర్‌ఐగా కోమలి బాధ్యతలు స్వీకరణ

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 30: బుచ్చిరాజుపాలెంలో ఉన్న గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కె.కోమలి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె కలెక్టరేట్‌లోని డీఎస్‌వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా, మర్రిపాలెం పరిధిలో సివిల్‌సప్లై విభాగం తనిఖీ అధికారినిగా విధులు నిర్వహించారు. ఆమెకు తహసీల్దార్ రమేశ్, డీటీ సువర్ణభాయ్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏడాకుల చెట్లను తొలగించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 30: పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఏడు ఆకుల చెట్లను తొలగించాలని సోమవారం జీవీఎంసీలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్‌కు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ చెట్ల వల్ల ఆస్మా రోగులతో పాటు చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వీటిని తొలగించి వాటి స్థానంలో ఇతర మొక్కలు వేయాలని కోరారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

సింధియా, సెప్టెంబర్ 30: సింధియా న్యూ కాలనీ ప్రధాన రోడ్డు రహదారి పక్కన పూర్తిగా పాడైపోయి ఓ పక్కకు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని సంబంధిత అధికారులు సోమవారం తొలగించి, దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టారు.

సెంట్రల్ జైలులో సినిమా షూటింగ్

విశాఖపట్నం, సెప్టెంబరు 30: కేంద్ర కారాగారంలో ఆదివారం సాయంత్రం నాని హీరోగా నటిస్తున్న హిట్-3 సినిమా షూటింగ్ జరిగింది. జైలులో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించినట్టు అధికారులు తెలిపారు. నాని పోలీస్ అధికారిగా జైలులో ఖైదీతో మాట్లాడిన సన్నివేశాన్ని చిత్రీకరించారు. అక్టోబరు ఐదున మళ్లీ జైలులో షూటింగ్ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **సత్యం సుందరం:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), సుకన్య, సౌజన్య, నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 48, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 24, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 44, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ22, క్యారెట్ 40 దొండకాయలు 42, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 85, మునక్కాడలు (కిలో) 90, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 36, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 66, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	95
ఫారం ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ప్రజా పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యం

పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

నేటి నుంచి మూడో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 30: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మంగళవారం నుంచి మూడో తేదీ వరకు చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,327వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఉక్కు కర్మాగారాన్ని వేధిస్తున్న ముడిసరకు సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ముడిసరకు లేనందునే ఉత్పత్తి తగ్గి నష్టాల బారిన పడుతున్నామన్నారు. కార్మికులంతా చిత్తశుద్ధితో పనిచేసి వంద శాతం ఉత్పత్తిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పూర్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడిపితే ఏడాదికి సుమారు రూ.ఐదో కోట్ల లాభం వస్తుందని ఆదినారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.ఆనంద్, జె.రామకృష్ణ, కె.రాజబాబు, నాయుడు, వరప్రసాద్, దుర్గా రావు, ఈశ్వర్, రమణ, గోవింద్, కాంగ్రెస్ నాయకుడు అప్పలనాయుడు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు కదలిరండి..

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటాలకు అన్ని వర్గాల వారు కదలిరావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నుంచి నిర్వహించనున్న ఆందోళనలకు సంబంధించిన పోస్టరును సోమవారం ప్లాంటులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పోరాటాల్లో భాగంగా అక్టోబరు రెండున గాంధీ జయంతిని పురస్కరించుకుని కూర్మన్నపాలెం జంక్షన్ వద్దగల దీక్షా శిబిరంలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఉక్కు సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నామన్నారు. ఆరో తేదీ ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు జాతీయ రహదారి అగనంపూడి నుంచి గాజువాక వరకు మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, జెర్రిపోతుల ముత్యాలు, రామ్‌కుమార్, కామేశ్వరరావు, శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. నిర్వాసితులకు, కాంట్రాక్టు కార్మికులకు అండగా నిలిచిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు సంస్థలకు విక్రయించాలని చూస్తూ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి జరుగున్న ప్రయత్నాలను నిరసిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఎదుట అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆందోళన చేశాయి. ఉద్యమాలతో ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు మరో ఉద్యమాన్ని చేపట్టాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి ప్రభాకరరెడ్డి, కొవిరి అవతారం, వంశీకృష్ణ, నగేశ్, పులి వెంకటరమణారెడ్డి, బి.పైడిరాజు, ఎస్.శ్రీనివాసరావు, ఎన్.రమణ, దొమ్మేటి అప్పారావు, పి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ



ఆందోళనలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఉక్కు బీసీ గేటు వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

3 నుంచి శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

పెందుర్తి, సెప్టెంబరు 30: చినముషిడివాడలోని శారదా పీఠంలో అక్టోబరు మూడు నుంచి పన్నెండో తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించనున్నట్టు పీఠం శ్రీకార్యం సోమవారం తెలిపింది. ఇందులో భాగంగా పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించనున్నారు. తొలిరోజు బాలాత్రిపురసుందరి, రెండో రోజు మహేశ్వరి, మూడో రోజు వైష్ణవి, నాలుగో రోజు అన్నపూర్ణ, ఐదో రోజు లలితాత్రిపురసుందరి, ఆరో రోజు మహా సరస్వతి, ఏడో రోజు మహాలక్ష్మి, ఎనిమిదో రోజు మహాకాళి, తొమ్మిదో రోజున మహిషాసురమర్ధినిగా అమ్మవారిని అలంకరించనున్నట్టు పేర్కొన్నారు. విజయదశమి పర్వదినాన అమ్మవారు విజయ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ప్రాంగణంలో రాజశ్యామల సహిత చండీయాగం, ప్రత్యేక పూజలు జరుపుతామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని స్వరూపానందేంద్ర సరస్వతి కోరారు.

ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయాలు

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్‌లోని దుర్గామల్లేశ్వర అయ్యప్పస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అక్టోబరు మూడు నుంచి 12 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా మూడున దుర్గాదేవిని బాలాత్రిపుర సుందరదేవిగా, నాలుగున గాయత్రీమాతగా, ఐదున అన్నపూర్ణదేవి, ఆరున శ్రీలలితాత్రిపురసుందరిదేవిగా, ఏడున మహాచండీగా, ఎనిమిదిన మహాలక్ష్మీదేవిగా, తొమ్మిదిన సరస్వతీదేవిగా, పదిన అష్టమిదుర్గగా, 11న మహిషాసుర మర్ధినిగా, 12న రాజరాజేశ్వరిదేవిగా దుర్గాదేవి భక్తులకు దర్శనమిస్తారన్నారు. అలాగే సాయిమాధవ నగర్‌లోని షిర్డీ సాయి ఆలయం, వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన భవానీ పీఠం, అప్పన్నపాలెం వర్షిణి టవర్స్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు

త్రినాథపురంలో పందిరి రాట

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి సోమవారం టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. అక్టోబరు మూడు నుంచి దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ ప్రదినిధులు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 30: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన ఎస్.నీలయ్య (45) భార్య జయలక్ష్మి, పిల్లలతో కలిసి అగనంపూడి సమీపంలోని కొండయ్యవలసలో నివాసముంటున్నారు. పనులు లేక నీలయ్యకు కుటుంబ పోషణ భారమైంది. దీంతో మనస్తాపంతో మద్యం తాగిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

పద్మనాభం, సెప్టెంబరు 30: వ్యక్తిని హత్యాయత్నం చేసిన కేసులో సోమవారం ముగ్గురిని అరెస్టు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన కథనం ప్రకారం.. పాత కొవ్వాడకు చెందిన తమటపు నారాయణమూర్తి పోస్టల్ శాఖలో పనిచేస్తూ పార్ట్ టైంగా ఒక పత్రికలో విలేఖరిగా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి పెంట గ్రామంలోని తన అత్తవారి ఇంటికి వచ్చారు. 10 గంటల సమయంలో బైక్‌పై ఇంటికి బయలుదేరుతున్న సమయంలో అప్పటికే సమీపంలో అదును కోసం కాపు కాసి ఉన్న పెంట గ్రామానికి చెందిన డి.పైడిరాజు, డి.గణేష్, రమణమ్మ, బి.చంద్రశేఖర్ ఆయనపై కత్తితో దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించారు. ఈ దాడిలో బాధితుడి తలపై గాయాలయ్యాయి. ఆయన గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు రాగా నిందితులు పరారయ్యారు. నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీధర్ కేసు దర్యాప్తు చేశారు. ఘటనకు కారణమైన పైడిరాజు, గణేష్, చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

గంజాయి కేసులో పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు పరారీ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 30: పోలీసులు కళ్లు కప్పి గంజాయి నిందితుడు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి.. సెప్టెంబరు 28వతేదీన ముందస్తు సమాచారంతో దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద కాపు కాసిన టాస్క్‌ఫోర్సు పోలీసులు ఏఎస్‌ఆర్ జిల్లా పెదబయలుకు చెందిన అరడా శివ కుమార్, ఓ బాలుడిని అదుపు లోనికి తీసుకుని తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయి, బైకును స్వాధీనం చేసుకుని దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అదే రోజు అర్ధరాత్రి సమయంలో స్టేషన్‌లో శివ కుమార్ పోలీసుల కళ్లు కప్పి పరారయ్యాడు. దీంతో పోలీసులు మూడు బృందాలుగా నిందితుడి కోసం గాలిస్తున్నా ఆచూకీ తెలియలేదు. బాలుడిని జ్యువెనల్ హోమ్‌కు తరలించారు.

'ఉక్కును పరిరక్షించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

గాజువాక, సెప్టెంబరు 30: స్టీల్‌ప్లాంటును పరిరక్షించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, నిర్వాసితులకు ఉపాధి వంటి అంశాలపై సీఎం చంద్రబాబునాయుడుతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చర్చించారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై చిత్తశుద్ధితో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు వైసీపీకి గానీ దాని తోక పార్టీలకు గానీ లేదన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు పెద్దాడ సోమినాయుడు, కె.వెంకటరావు, అజయ్‌కుమార్, పల్లా రమేశ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై రౌండ్ టేబుల్ సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 30: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 32 మంది అదే కోర్టులో కేసులు వేశారని జాతీయ బౌద్ధ మహాసభ సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో లేని పదాలను ఆపాదించారన్నారు. 1935 నుంచి కుల గణన జరగలేదని, వర్గీకరణ వల్ల ఉప కులాల మధ్య వైరుధ్యం పెరుగుతుందే తప్పా ఎటువంటి ఉపయోగం లేదన్నారు. అందువల్ల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలన చేయాలని కోరారు. సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య, ఉక్కు కార్మిక నాయకులు మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావు, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

పెందుర్తి-రూరల్, సెప్టెంబరు 30: పెందుర్తి మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఎం.ఆనందకుమార్‌ను 95వ కార్పొరేటరు ముమ్మన దేముడు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తన వార్డుపరిధిలో రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. త్వరితగతిన ధ్రువపత్రాలు మంజూరుచేయాలన్నారు.



దీపారాధనలో పాల్గొన్న పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

తిరుమలను అపవిత్రం చేసిన వైసీపీ పాలకులు

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, సెప్టెంబరు 30: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వైసీపీ ప్రభుత్వం తిరుమలను అపవిత్రం చేసిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సుజాతనగర్ సమీపాన రత్నగిరినగర్ కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం జనసేన వీర మహిళలు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 300 మంది దీపాలంకరణ చేశారు. ఈ దీపారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఐతి సింహాచలం, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

నియోజకవర్గ పరిధిలోని పలు వార్డు పరిధిల్లోని జీవీఎంపీ వార్డు అభివృద్ధి పనులపై సుజాతనగర్‌లో గల క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఎనిమిదో జోన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒక్కో వార్డుకు రూ. కోటి నిధులతో చేపట్టనున్న మౌలిక వసతుల పనులపై చర్చించారు. జెడ్సీ హైమావతి, అధికారులు పాల్గొన్నారు.

పంచకర్లకు కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

వేపగుంట: రుషికొండలో కొద్దిరోజుల కిందట జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కోలుకున్న గల్లా నిఖిల్‌రాజ్ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. సబ్బవరానికి చెందిన జనసైనికుడు నిఖిల్ రాజు రుషికొండ ఐటీ సెజ్‌లో ఫైబర్ నెట్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గతనెల అక్కడ స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని జనసేన నాయకులు పంచకర్ల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన గీతం ఆస్పత్రి అధినేత, ఎంపీ శ్రీభరత్‌కు ఫోన్ చేసి వారి ఆస్పత్రిలో చికిత్స ఇప్పించారు. ప్రస్తుతం నిఖిల్ కోలుకోవడంతో సోమవారం స్థానిక నాయకులతో కలిసి పంచకర్లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రమదానంతో వాకింగ్ ట్రాక్ శుభ్రం

పెదగంట్యాడ , సెప్టెంబరు 30: వికాస్‌నగర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలోని వాకింగ్ ట్రాక్‌ను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం శ్రమదానం చేసి శుభ్రపరిచారు. వాకింగ్ ట్రాక్‌లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పిలుపు మేరకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రమదానం చేశారు. శ్రమదానంలో సుమారు 80 మంది వాకర్స్‌తో పాటు వార్డు పరిధిలో గత సచివాలయాలకు చెందిన ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నట్టు అసోసియేషన్ సభ్యులు ఎన్‌వై నాయుడు, కాశీవిశ్వేశ్వరరావులు తెలిపారు.

తిరుమలనగర్ వాకర్స్ పార్కులో..

కూర్మన్నపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటురోగాలు దరి చేరవని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావులు అన్నారు. 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలోని వాకర్స్ పార్కులో సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. ఇంకుడు గుంతల పరిసరాలు, పార్కు, ఓపెన్ జిమ్, తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. రహదారులను చీపుర్లతో శుభ్రపరిచారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 ఫిర్యాదులు

వేపగుంట, సెప్టెంబరు 30: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు ఫిర్యాదులు అందాయి. 93వ వార్డు శ్రీనివాసనగర్‌లో కాలువపై ఐరన్ షీట్ వేయడంతో తలెత్తుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, 94వ వార్డు గౌతమ్‌నగర్‌లో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని ఆపాలని, 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని, శేషాద్రినగర్ కాలనీలో పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. 96వ వార్డు సుజాతానగర్ టీచర్స్ లేఅవుట్‌లో యూజీడీ కనెక్షన్ ఏర్పాటుచేయాలని, టీచర్స్ లేఅవుట్ ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మించాలని వినతులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపించి చర్యలు చేపడతామని జెడ్సీ కె.హైమావతి పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

అగనంపూడి, సెప్టెంబరు 30: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లోని గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. స్థానికులు గుర్తించి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. 85వ వార్డు పరిధి దిబ్బపాలెంలో చిప్పాడ నూకరాజు కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. రాత్రి భోజనాలు చేశాక అందరూ నిద్రపోయారు. అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇల్లంతా దట్టమైన పొగ కమ్ముకుంది. దీనిని స్థానికులు గుర్తించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి పెద్దగా కేకలు వేయడంతో ఇంట్లో నుంచి నూకరాజు కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. అప్పటికే ఫ్రిడ్జితో పాటు ఫ్యాన్లు, పలు గృహోపకరణాలు కాలిపోయాయి. స్థానికుల సాయంతో ఇంట్లోని సామగ్రిని బయటకు తీసి మంటలను అదుపులోకి తెచ్చారు. స్థానిక నాయకులు కర్రి దోశేంద్ర, ఎలమంచిలి అప్పారావు, తదితరులు బాధితలను పరామర్శించి, ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు.

ఆలయ స్థలాన్ని కాపాడాలని ఆందోళన

అగనంపూడి, సెప్టెంబరు 30: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసకు చెందిన అమ్మవారి ఆలయ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ స్థానికులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థలం వద్ద ఆక్రమణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానికంగా ఉంటున్న ఇద్దరు వ్యక్తులు అమ్మవారి ఆలయానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. అందువల్ల ఉన్నాతాధికారులు చొరవ తీసుకుని ఆలయ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. దీనిపై ఈ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు ఇందల అశోక్‌కుమార్, పి.మణిబాబు, సాంబశివరావు, పరదేశమ్మ, రాము, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విజ్ఞాన్ విద్యార్థులు ఎంపిక

అగనంపూడి, సెప్టెంబరు 30: విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-20 విభాగంలో పి.సాయితేజ, కె.మోనాలి, ప్రవణశ్రీ, విశేష మంచి కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబరు నాలుగు నుంచి రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. కాగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్ సుధాకర్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ సతీశ్, పీడీలు సీహెచ్ రాంబాబు, ప్రశాంత్, ఎస్‌వీ రమణ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదును అధికంగా చేపట్టాలి'

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 30: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును అత్యధికంగా చేసేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా శ్రమించాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో బీజేపీ జిల్లా కార్యదర్శి బొండా ఎల్లాజీ, శ్రీదేవిల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 14 వేల మంది సభ్యత్వ నమోదు పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ, రమణారావు, బాబూరావు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

గాజువాక, సెప్టెంబరు 30: ఇక్కడి విజయదుర్గాదేవి ఆలయంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం గాజువాకలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, అమ్మవారు రోజుకోక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అప్పలసూరి, వెంకటరమణ, రమణ, సత్యనారాయణ, జోగారావు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పెల్‌బీలో విజేతలకు బహుమతులు ప్రదానం



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

సీతమ్మధార, సెప్టెంబరు 30: సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వేదికపై ఎక్స్‌ట్రా స్కూల్, ఇంగ్లీష్ విజార్డ్స్ స్పెల్‌బీ సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా జాతీయ స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అనిర్‌బాన్ పాల్, జనరేషన్ యువ వ్యవస్థాపకులు బి.నరేష్‌కుమార్, ఉపాధ్యాయినులు పి.లలిత, సౌమ్య ప్రభల చేతుల మీదుగా విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్లు, మెడల్స్ ట్రోఫీలను అందచేశారు.టి.అనుకర్, ఎం.అనుష్కా, ఇసిత గుప్తలు మొదటి స్థానాల్లో నిలిచారు.

'తిరుపతి లడ్డూ వ్యవహారంపై స్వరూపానందేంద్ర మాట్లాడరేం?

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 30: తిరుమలలో లడ్డూ అపవిత్రం చేసిన అంశంపై కనీసం శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఎందుకు నోరు మెదపడం లేదని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామతీర్థంలో శ్రీరాముని విగ్రహ శిరచ్ఛేదం సమయంలోనూ స్వామిజీ స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2న ఉదయం 11 గంటలకు శారదాపీఠాధిపతి వీటిపై చర్చకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నికుంజ్, సురేష్, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, రాము, కృష్ణవేణి పాల్గొన్నారు.

జనసేన నేతల దీపారాధన

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 3: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద జనసేన ఆధ్వర్యంలో నిర్వహించినదీపారాధనలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష సంఘీభావంగా కూటమి నేతలు ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు దీపారాధన చేశారు.

పోలీసు కమిషనరేట్ 96 ఫిర్యాదులు

మహారాణిపేట, సెప్టెంబరు 30: పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 96 ఫిర్యాదులు వచ్చినట్టు కమిషనర్ శంఖ బ్రత బాగ్చీ తెలిపారు. అధికారులతో మాట్లాడి ఈసమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నగరానికి రాక రేపు

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల రెండో తేదీన నగరానికి రానున్నారు. ఉదయం 9.25 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న ఆమె అక్కడి నుంచి నేరుగా జీవీఎంసీ ఎదుట మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు చేరుకుంటారు. ఈ సందర్భంగా బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలో పాల్గొంటారు. అనంతరం మీడియాతో మాట్లాడనున్నారు.

రక్షణ గోడ నిర్మాణ పనులకు బ్రేక్

»» మాధవధారలో అడ్డుకున్న స్థానికులు



నిర్మాణ సామగ్రిని వదిలేసి వెళ్లిన అధికారులు

మురళీనగర్, సెప్టెంబర్ 30; సింహాచల దేవస్థానం ఉప దేవాలయమైన మాధవధార పుణ్యక్షేత్రం వద్ద ఆరంభించిన రక్షణ గోడ పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. ఉడా ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం భూములకు రక్షణగా వైసీపీ ప్రభుత్వ హయాంలో గత ఏడాది ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాన్ని ఎంపీ విజయసాయి రెడ్డి ప్రారంభించారు. హనుమంతవాక తదితర ప్రాంతాల్లో కొంతవరకు ఈ గోడ పూర్తి చేశారు. అయితే, సింహాచలం దేవస్థానం కొండకు ఇటువైపు ఉన్న మాధవధార భూములకు రక్షణగా గోడ ఆరంభించేందుకు సోమవారం ఇక్కడకు చేరుకున్న దేవస్థానం సూపరింటెండెంట్ ఎ.త్రిమూర్తులు, అధికారులు, సిబ్బందిని ఇక్కడి మాధవధార గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామంలో చాలామేర భూములు తమవంటూ తమ వద్ద ఉన్న కొన్ని ఆధారాలు, కోర్టు కేసులో కాగితాలను చూపించి పనులు చేపట్టడానికి వీలు లేదని అడ్డుకున్నారు. దీంతో సూపరింటెండెంట్ త్రిమూర్తులు వారికి సర్దిచెప్పి, తమ దేవస్థానం లీగల్ సెల్‌లో విచారించిన తర్వాత ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తున్నట్టు వివరించారు. అయితే, విజయనగరం రాజుల నుంచి తమకు సంక్రమించిన భూములు కొందరి చేతుల్లో ఉన్నట్టు మాధవధార గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో వివాదం ఉండగా వాల్ కట్టమని, స్థానికుల స్థలాలను గుర్తించిన తర్వాత ముందుకు సాగుతాయని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. దీంతో తాత్కాలిక షెడ్డు, తీసుకువచ్చిన యంత్ర పరికరాలు వదిలేసి అధికారులు వెళ్లిపోయారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

»» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు



మాట్లాడుతున్న నరసింగరావు

సిరిపురం, సెప్టెంబరు 30 : సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతి తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటున్నాయని, 1991 తరువాత సరళీకరణ విధానాల పేరుతో రెగ్యులర్ చేయడం నిలుపుదల చేశారన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకపోగా బేసిక్ పే కూడా చెల్లించడం లేదని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోతే, ఇక ప్రైవేట్ రంగంలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఊహించుకుంటేనే భయంగా ఉందన్నారు. కాగా అంతకముందు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్, సెంట్రల్ పార్కు మీదుగా భారీ ప్రదర్శన అనంతరం ధర్నా వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్ పి. వెంకటరెడ్డి, బి. జగన్, యు. రాజు, నూకరాజు, సుబ్బారావు, మణి, జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్, పోర్టు, రైల్వే, కోరమాండల్, ఆర్టీసీ, విశాఖ డెయిరీ, ప్రభుత్వ హాస్పటల్స్, 108, విద్యుత్, పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

'కిరండోల్'కు అదనపు విస్టాడమ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

విశాఖపట్నం, సెప్టెంబరు 30: ప్రయాణికుల రద్దీని దృష్ట్యా విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న 08551, 08552 నంబరు గల రైళ్లకు పరిమిత తేదీల్లో అదనంగా ఒక విస్టాడమ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలుకు (08551) ఈనెల 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19 తేదీల్లో... తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశాఖ రైలుకు (08552) ఈనెల 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20వ తేదీల్లో అదనంగా ఒక విస్టాడమ్ కోచ్ అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు. అలాగే విశాఖ- కిరండోల్ రైలుకు (08551) ఈనెల 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20వ తేదీల్లో...తిరిగి కిరండోల్-విశాఖ రైలుకు (08552) ఈనెల 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21 తేదీల్లో అదనంగా ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్టు వివరించారు.

క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి

»» ఎమ్మెల్యే వంశీ కృష్ణ



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 30: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. సోమవారంఎంవీడీఎం పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లో పలు పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటుచేసిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ఎమ్మెల్యే క్రీడల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీలను ఆయన స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్. శేషకుమారితో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు కార్పొరేటర్ సాధిక్. కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూల్స్ ఫెడరేషన్ గేమ్స్ ప్రారంభం

సీతంపేట: మధురనగర్‌లోని మధురనగర్ జీవీఎంసీ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక సోమవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం శాంతికుమారి. పీటీ మాస్టర్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



జ్యోతి, పిల్లలు(ఫైల్)

పెందుర్తి, సెప్టెంబరు 30: పుట్టింటికి వచ్చి తిరిగి అత్తింటికి ఆటోలో బయలుదేరిన వివాహిత ఇద్దరి పిల్లలతో అదృశ్యమైంది. సీఐ కె. సతీశ్‌కుమార్ సోమవారం తెలిపిన వివరాలివి..గాజువాకలో నివాసముంటున్న కుదార సాయికుమార్‌తో పెందుర్తికి చెందిన జ్యోతి (24) కి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల దీక్షిత, ఏడాదిన్నర వయసు గల దిత్యశ్రీ కుమార్తెలున్నారు. జ్యోతి తల్లికి నేత్ర శస్త్రచికిత్స జరగడంతో సపర్యలు చేయడానికి పది రోజుల క్రితం పెందుర్తిలో టీటీడీసీ వెనుకన ఉన్న ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో తల్లి కోలుకోవడం తో సెప్టెంబరు 26వతేదీన జ్యోతి తన ఇద్దరి పిల్లలతో పెందుర్తి నుంచి అత్తింటికి గాజువాక ఆటోలో బయలుదేరింది. అయితే, వారు అత్తవారింటికి చేరలేదు. భార్య, పిల్లలు ఇంటికి రాకపోవడంతో భర్త సాయికుమార్ బంధువులు,స్నేహితుల ఇళ్లల్లో వెదికినా ఫలితం దక్కలేదు. దీంతో అదృశ్యంపై జ్యోతి అక్క శ్రావణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గెడ్డలో గుర్తుతెలియని మృతదేహం

సీతంపేట, సెప్టెంబరు 30: అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డు పుట్ట బంగారమ్మ తల్లి గుడి వద్ద గల గెడ్డలో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృత దేహం లభ్యమైంది. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఈ మృతదేహన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. వివరాలు తెలిసిన వారు ఫోన్: 9440796058కు సమాచారమివ్వాలని ఎస్ఐ కోరారు.

'జీవీఎంసీ ఉద్యోగుల నిర్లక్ష్యంతో జీతాలు జాప్యం'



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 30: జీవీఎంసీ పరిధి వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలు బిల్లుల ప్రక్రియలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సంఘం నాయకులు కోరారు. సోమవారం జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జె. గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. జీవీఎంసీలో మోనటరింగ్ సెల్‌లో కొంతమంది ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా జీతాల బిల్లుల్లో తీవ్ర జాప్యమవుతుంద ఆరోపించారు. ఈ సమస్యయ పునరావృతం కాకుండా సదరు ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకాయల బంగార్రాజు, సందీప్, అశోక్ కుమార్, ఎస్. సాయికృష్ణ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ఉద్యోగులు

కంచరపాలెం,సెప్టెంబరు 30: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని జీవీఎంసీ ఐదో జోన్ కమిషనర్ బి.రాము పేర్కొన్నారు. స్థానిక రైతుబజారులో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. జోన్ అధికారులతో కలిసి ఆయన బజారు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం రైతులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డా.సునీల్, బీజేపీ నాయకుడు ఆర్.రాంబాబు, బజారు ఎస్టేట్ అధికారి సీహెచ్.కృష్ణమూర్తితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రోగ్రాం అధికారి డాక్టర్ .కె .మాణిక్యకుమారి ఆధ్వర్యంలో సోమవారం జ్ఞానాపురం నుంచి ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టేషన్ మీదుగా డాబాగార్డెన్స్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు.

మాధవధార: ప్రజలంతా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ సీనియర్ స్టాటస్టికల్ అధికారి ఎస్.పల్లంరాజు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ జంక్షన్ అప్పయ్యనగర్‌లోని ఎన్ఎస్ఎస్ఓ సబ్ రీజినల్ కార్యాలయం నుంచి ఉద్యోగులు సోమవారం 'స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత' ర్యాలీ నిర్వహించారు.

15 నాటికి విశాఖ విజన్-2029

... 5వ పేజీ తరువాయి

మూడో విభాగంలో ఐటీ, పర్యాటకం, అతిథ్య రంగాల అభివృద్ధికి అనువుగా విశాఖ విజన్-2029 రూపొందిస్తామన్నారు. ప్రతి ఏడాది 15 శాతం ఆర్థిక వృద్ధి వచ్చేలా ప్రణాళికల్లో లక్ష్యాలు పొందుపర్చుతామన్నారు. విశాఖ విజన్-2029, స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ తయారీపై అక్టోబరు 3,4,5 తేదీల్లో భాగస్వామ్యులతో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఇంకా ప్రజా ప్రతినిధుల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ కింద వచ్చిన దరఖాస్తులను అక్టోబరు 10వ తేదీలోగా పరిశీలించాలని అధికారులకు సూచించామన్నారు. ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో శాఖలు సాధించిన లక్ష్యాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. విశాఖ జిల్లా అవసరాలకు తగినంత ఇసుక కోసం గోదావరి, వంశధార నదుల్లో రెండు రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రస్తుతం రెండు నదుల నుంచి ఇసుక సరఫరాకు ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభమైందన్నారు. అయితే శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నదికి వరద కొనసాగుతున్నందున ఇసుక తవ్వకాలు నెమ్మదిగా సాగుతున్నాయన్నారు. నదిలో నీరు తగ్గిన తరువాత డిమాండ్‌కు తగిన ఇసుక లభ్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ నిర్మాణాలు, ప్రైవేటు బిల్డర్లకు బల్క్‌గా ఇసుక అందిస్తున్నామని, తక్కువ మొత్తం ఇసుక అవసరమయ్యే వారికి సరఫరా చేసేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. నదుల నుంచి ఇసుక తీసుకువచ్చే లారీ ఆపరేటర్లకు 80 కిలోమీటర్లు దాటిన తరువాత కిలోమీటరుకు ఇచ్చే చార్జీ పెంచామన్నారు. అయితే రవాణా చార్జీలపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. నదుల్లో నీటి ప్రవాహం తగ్గిన తరువాత నగరానికి ఇసుక సరఫరా మరింత పెరుగుతుందని, ఇందుకు ఒకటి, రెండు వారాల సమయం పడుతుందన్నారు.

ఆవు మృతికి కారణమైన ఐదుగురిపై సస్పెన్షన్ వేటు

... 5వ పేజీ తరువాయి

బృందం మూడు రోజులు కిందట పట్టుకుంది. వాహనంలో ఆరిలోవలోని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించింది. అయితే చూడి (గర్భం)తో ఉన్న ఆవుకు సంరక్షణ కల్పించాల్సిన సిబ్బంది ఎలాంటి ఆహారం అందించకుండా వదిలేశారు. దీంతో ఆవు సోమవారం తెల్లవారుజామున సంరక్షణ కేంద్రంలో మృతిచెందింది. దీనిపై జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌కు ఆవు యజమాని ఫిర్యాదు చేశారు. అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుని, ఆవు యజమానికి న్యాయం చేయాలని మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ జంతు సంరక్షణ కేంద్రానికి వెళ్లి విచారణ నిర్వహించారు. ఆవు మృతికి బాధ్యులనే అభియోగంపై వాహనం డ్రైవర్ యు.రమణ, జంతువుల క్యాచర్లు కె.నర్సింగరావు, ఎస్.లక్ష్మణ్, బిసంతోష్‌కుమార్, కె.శ్రీనులను విచారణ పూర్తయ్యేంత వరకూ విధుల నుంచి సస్పెండ్ చేశారు. పీహెచ్ మేస్త్రీగా పనిచేస్తున్న కె.లక్ష్మణరావుకు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఆవు యజమానికి జీవీఎంసీ తరఫున రూ.40 వేలు పరిహారం అందజేశారు.

వినతులను సత్వరం పరిష్కరించాలి

»» ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి వచ్చే ప్రతి వినతినీ పరిష్కరించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 303 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్,ఇతర అధికారులుపాల్గొన్నారు.

శాంతి ఆశ్రమ భూములు కాపాడండి

భూ కబ్జాదారుల గుప్పిట్లో చిక్కుకున్న శాంతి ఆశ్రమ భూములను పరిరక్షించాలని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. చిన్నవాల్తేరు శాంతి ఆశ్రమం వద్ద పదెకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకోవడంతో కోర్టును ఆశ్రయించడంతో, శాంతి ఆశ్రమానికి అనుకూలంగా తీర్పునిస్తూ సెప్టెంబరు 30లోగా భూములను ఆశ్రమానికి అప్పగించాలని ఆదేశించిందన్నారు.

లాడ్జి నిర్మాణం నిలిపివేయాలి

గ్రేటర్ 29వ వార్డులో నివాసగృహాల మధ్య లాడ్జి నిర్వహణ కోసం బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, దానిని నిలిపివేయాలని కృష్ణానగర్ వాసులు కోరారు.

కేసు కోర్టులో ఉండగా ల్యాండ్ పూలింగ్ సర్టిఫికెట్లు జారీ చేశారని దువ్వి అవన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భీమిలి మండలం అన్నవరం గ్రామానికి చెందిన 8.5 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వమని ప్రభుత్వం కోరిందని, దీనిపై హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు కేసులో ఉన్న భూమికి కొంతమంది వ్యక్తుల పేరిట ల్యాండ్‌పూలింగ్ సర్టిఫికెట్ ఇవ్వడం చట్ట వ్యతిరేకమని, హక్కులు కల్పించాలని కోరారు.

మత్స్యకారుల భద్రతకు సాంకేతిక పరికరాలు

»» ఎంపీ శ్రీభరత్



సాంకేతిక పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీ

మహారాణిపేట, సెప్టెంబరు 30: సముద్రంలో చేపలు పట్టే మత్స్యకారులకు సురక్షిత నేవిగేషన్ కమ్యూనికేషన్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్టు ఎంపీ ఎం. శ్రీభరత్ తెలిపారు. సోమవారం ఫిషింగ్ హార్బర్‌లోని న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభు త్వం అందించిన వెసెల్ కమ్యూనికేషన్ సిస్టం పరికరం అమర్చే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వీసీఎస్ ద్వారా నడి సముద్రంలో రెండు వైపులా సంభాషణ చేసుకోవచ్చన్నారు. అత్యవసర సమయంలో మత్స్యకా రులకు సులభంగా అర్థమయ్యేలా ఇంటం ఫేస్ జియో పెన్సింగ్ సిస్టం ద్వారా వాతావరణ హెచ్చరికలు అందజేస్తారని చెప్పారు. చేపల వేట సమయంలో మత్స్యకారులు ఇబ్బందులకులోనైతే, ఉపయోగించే నేవిగేషన్ పరికరాల్లో ఎన్నో ప్రత్యేకతలున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు సామాజిక పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నారు. ఉదయం 5.30 గంటల నుంచి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లుచేశారు. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో సిబ్బందికి పింఛన్ల సొమ్ము అందజేశారు. జిల్లాలో 1,62,490 మందికి రూ. 69,80, 10,500లు పంపిణీచేస్తారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,948 మందికి రూ. 11, 20, 64, 500లు, జీవీఎంసీలో 1,35,542మందికి రూ. 58,60,36,000 చెల్లిస్తారు.

ఫెడెక్స్ ఫ్రాడ్స్

... 5వ పేజీ తరువాయి

ఏదోలా అతన్ని కేసు నుంచి బయటపడేలా చూడాలని ఉన్నతాధికారిని విజ్ఞప్తి చేస్తున్నట్టు నటిస్తారు. ఆ సమయంలో ఉన్నతాధికారులుగా నటించే వ్యక్తులు కూడా 'సరే ఏదోలా చేసేయ్' అని అవకాశం ఇచ్చినట్టు వదిలేస్తారు. వెంటనే బాధితుడికి స్కైప్ లేదా వాట్సాప్ వీడియోకాల్ చేసి కేసు విచారణ విషయాన్ని కుటుంబ సభ్యులకు కూడా చెప్పొద్దని, బయటకు పొక్కితే తాము సాయం చేయలేమని బాధితుడిని బెదిరిస్తారు. తర్వాత పోలీస్/కస్టమ్స్ విచారణలో భాగంగా బ్యాంకు ఖాతాలోని నగదును తాము చెప్పిన ఖాతాకు బదిలీ చేయాలని, విచారణ తర్వాత 20నిమిషాల్లో తిరిగి అదే ఖాతాకు జమ అయిపోతుందని చెబుతారు. దీనికి సంబంధించి ఆర్‌బీఐఅనుమతి ఇచ్చిందంటూ నకిలీ ఆర్డర్ కాపీని బాధితుడికి పంపిస్తారు. నిజమేనని భావించిన బాధితుడు తన ఖాతాలోని నగదుని సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాకు బదలాయించగానే సైబర్ నేరగాళ్లు లైన్‌లన్నీ కట్ చేసేస్తారు.

ఈ తరహా మోసాలు నగరంలో పెరుగుతుండడం పోలీసులను సైతం కలవరపాటుకు గురిచేస్తోంది. ఇటీవల నగరానికి చెందిన ఒక లాజిస్టిక్ వ్యాపారికి ఇలాంటి ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబై కస్టమ్స్ అధికారులమని పరిచయం చేసుకుని 'మీ పేరు మీద తైవాన్‌కు ఫెడెక్స్‌లో ఒక కొరియర్ బుక్ చేశారని' చెప్పారు. తాను ఎలాంటి కొరియర్ పంపించలేదని లాజిస్టిక్ వ్యాపారి చెప్పగా, అవతలి వ్యక్తులు వ్యాపారి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, కార్యాలయం వివరాలతో సహా ఏకరువుపెట్టడంతో నిజమేనని భావించారు. కొరియర్ బుకింగ్ నంబర్ చెప్పి అందులో నిషేధిత నార్కోటిక్ డ్రగ్స్‌తోపాటు నకిలీ పాస్‌పోర్టులు, క్రెడిట్ కార్డులు ఉన్నాయని చెప్పడంతో వ్యాపారి భయపడిపోయారు. విచారణకు సహకరిస్తే కేసు లేకుండా బయటపడేలా చేస్తామంటూ సైబర్ నేరగాళ్లు బాధితుడికి చెప్పారు. దీంతో వారు చెప్పినట్టే బాధితుడు తన ఖాతాలోని రూ.1.3 కోట్లను సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. వెంటనే ఫోన్ కట్ అవ్వడంతో బాధితుడు అనుమానంతో సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి విషయం చెప్పారు. సైబర్‌క్రైమ్ పోలీసులు అప్రమత్తమై బ్యాంకు అధికారులతో మాట్లాడి బాధితుడి ఖాతా నుంచి నగదు వెళ్లిన సైబర్ నేరగాళ్ల ఖాతాను ఫ్రీజ్ చేసి అందులో అప్పటికి ఉన్న రూ.85,70,923ని హోల్డ్‌లో పెట్టించారు. రెండు రోజుల కిందట ప్రైవేటు ఉద్యోగి ఒకరికి గుర్తుతెలియని రెండు నంబర్ల నుంచి వరుసగా వాట్సాప్ కాల్స్ వచ్చాయి. పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తుల ఫొటోలు డీపీలుగా ఉన్నాయి. కానీ ఫోన్ నంబర్ సిరీస్ +92తో ఉండడంతో సైబర్ నేరగాళ్లు అయివుంటారని అనుమానించి ఆయన ఫోన్ లిఫ్ట్‌చేయలేదు. దీనిపై సైబర్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా ఆ రెండు నంబర్లు కూడా సైబర్ నేరగాళ్లవేనని నిర్ధారించారు. ఇలాంటి కేసులు చాలా ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు.

అవగాహనతోనే నేరాలకు అడ్డుకట్ట

కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు ప్రజలను బురిడీ కొట్టించేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తుంటారు. ప్రస్తుతం ఫెడెక్స్ కొరియర్, టాస్క్ బేస్డ్ ఫ్రాడ్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్స్, హనీట్రాప్ వంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీసులు/కస్టమ్స్ అధికారులు ఏదైనా కేసు ఉంటే ఫోన్‌లో విచారణ చేయరని గుర్తించాలి. ఏదైనా ఉంటే ముందుగా నోటీసు ఇచ్చి తర్వాత ప్రత్యక్షంగా విచారిస్తారు తప్పితే వాట్సాప్ కాల్ చేసి విచారణ చేయరు. అలాగే బ్యాంకు ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని అడిగే ప్రసక్తే ఉండదు. బాధాకరమైన విషయం ఏమిటంటే సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్న వారంతా విద్యావంతులు, ఉన్నతస్థానాల్లో ఉన్నవారే ఉంటున్నారు. ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడు మాత్రమే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

రోడ్డెక్కిన డాక్‌యార్డు ఉద్యోగులు

... 5వ పేజీ తరువాయి

చేశారు. నేవీకి చెందిన ఎస్‌బీసీ వంతెన ఉండగా..చుట్టూ తిరిగి వెళ్లాల్సిన కర్మ ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా ప్రయాణించడంతోనే దిలీప్‌కుమార్ ప్రాణాలు కోల్పోయారని, ఆయన భార్య, ఆరు నెలల బిడ్డ అనాథలయ్యారన్నారు. అలాంటి పరిస్థితి మరొకరికి రాకూడదన్నారు. ఎస్‌బీసీ వంతెన పైనుంచి ఉద్యోగుల రాకపోకలకు అంగీకరించేంత వరకూ కదిలేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, నగర పోలీసు కమిషనర్ వచ్చి వంతెన పైనుంచి రాకపోకలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాదని తమను బలవంతంగా తరలించాలని చూస్తే ఆత్మాహుతి చేసుకుంటామని హెచ్చరించారు. పరిశ్రమలో ఉన్నవారిని బయటకు..వెలుపల ఉన్న వారిని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దాదాపు పది వేల మందికిపైగా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ నిరసన సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగింది. తిరిగి మంగళవారం కొనసాగిస్తామని తెలిపారు.

ఎన్ని వినతులిచ్చినా ఫలితంలేకపోయింది..

డాక్‌యార్డులోకి అనుసంధానంగా ఉన్న ఎస్‌బీసీ వంతెన పైనుంచి రాకపోకలకు అవకాశం కల్పించాలని కోరుతూ అనేకసార్లు జిల్లా ఉన్నతాధికారులు, ఎంపీలు, కేంద్ర మంత్రులకు వినతి పత్రాలిచ్చినా ఫలితం లేకుండా పోయిందని డాక్‌యార్డు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే తాము ఆందోళన చేపట్టాల్సి వచ్చినట్టు చెప్పారు.

స్పృహ కోల్పోయిన కానిస్టేబుల్

డాక్‌యార్డు ఉద్యోగులు చేపడుతున్న ఆందోళన కార్యక్రమం వద్ద బందోబస్తుకు వచ్చిన మల్కాపురం స్టేషన్ కానిస్టేబుల్ ఎండ తీవ్రతకు స్పృహతప్పిపడిపోయారు. వెంటనే అక్కడ ఉన్న ఉద్యోగులు, పోలీసు సిబ్బంది సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉంది.

వీధి దీపాలు శతశాతం వెలగాల్సిందే

... 5వ పేజీ తరువాయి

కారణాలపై ఆరా తీశారు. స్విచ్ బాక్స్‌ల్లో సమస్య ఉన్నట్టు ఏజెన్సీ ప్రతినిధి ఒకరు చెప్పడంతో దానిని తెరిచి సమస్యను గుర్తించాలని ఆదేశించారు. అక్కడి నుంచి అక్కయ్యపాలెం, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, బీచ్‌రోడ్డులో వీధి దీపాలను పరిశీలించారు. బీచ్‌రోడ్డులో వీధి దీపాల నుంచి తక్కువ కాంతి వస్తుండడంతో అక్కడ పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను సరైన వెలుతురు లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రజలకు జీవీఎంసీ కల్పించాల్సిన మౌలిక సదుపాయాల్లో వీధి దీపాలు ప్రధానమైనవన్నారు. అయితే ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఆ సదుపాయాన్ని కల్పించలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులతోపాటు ఎమ్మెల్యేలు కూడా వీధి దీపాల సమస్యను ప్రస్తావించారని, అసలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే ఒక నోటీసు జారీ చేశామని, 15 రోజుల్లోగా పూర్తిస్థాయిలో వీధి దీపాలను వెలిగించాల్సిందేనని స్పష్టం చేశారు. కొత్తగా వీధి దీపాలు ఏర్పాటుచేయాల్సిన ప్రాంతాలపై జీవీఎంసీ, పోలీస్ శాఖ సంయుక్తంగా ఒక జాబితా ఇచ్చినందున 30 రోజుల్లోగా అక్కడ అమర్చాలని ఆదేశించారు. కాంతి తక్కువగా ఉన్న చోట ప్రకాశవంతమైన వీధి దీపాలను ఏర్పాటుచేసేందుకు 45 రోజులు గడువు ఇస్తున్నట్టు చెప్పారు. ఇకపై రోజు విడిచి రోజు వీధి దీపాల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తానని, తేడా వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఇంజనీరింగ్ అధికారులతోపాటు ఏజెన్సీ ప్రతినిధులను హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12 మందికి జరిమానా

ఎండాడ, సెప్టెంబరు 30 : డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రెండవ స్పెషల్ జ్యుడిషియల్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి 12 మందికి జరిమానా, ఒకరికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం...స్టేషన్ పరిధిలోని మధురవాడ, కొమ్మాది తదితర ప్రాంతాల్లో పోలీసులు రెండు రోజులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో తనిఖీల్లో పట్టుబడిన 13 మందిపై కేసు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపరిచగా న్యాయమూర్తి 12 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా, బి. వెంకటరమణకు మూడు రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

తుప్పు పట్టిన నూకాలమ్మ ఆలయ షెడ్



భీమునిపట్నం, సెప్టెంబరు 30 : పట్టణంలో నూకాలమ్మ ఆలయం వద్ద భక్తుల వసతి కోసం ఏర్పాటు చేసిన ఐరన్ రేకుల షెడ్ తుప్పు పట్టి పాడవుతోంది. ఆలయానికి ముందు భాగంలో భక్తుల వసతి కోసం ఈషెడ్ నిర్మించారు. ప్రతి మంగళవారం దూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు. హుద్‌హుద్ తుపాను సమయంలో ఏర్పాటు చేసిన ఈ షెడ్ సముద్ర తీరంలో ఉండడంతో ఉప్పు గాలికి పదేళ్లలోనే బాగా తుప్పు పట్టి పాడైంది. దీంతో ఏ క్షణాన కూలుతుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి షెడ్ మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, సెప్టెంబరు 30 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలదేవి సమేతంగా స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో పూజ చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

చిన్నారులకు స్లీపింగ్ ప్యాడ్స్ పంపిణీ

విశాలాక్షినగర్, సెప్టెంబరు 30 : జీవీఎంసీ 9వ వార్డులో ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు విశాఖ పార్లమెంట్ మహిళా మోర్చా నాయకురాలు ఉమ్మడి సుజాత సోమవారం స్లీపింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

ఆనందపురం, సెప్టెంబరు 30 : మండలంలోని శిర్లపాలెం గ్రామంలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ ఎం. జ్యోతి మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగికంగా సంక్రమించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'మీకు తెలుసా' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సినిమా గైడ్

● **సత్యం సుందరం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), సుకన్య, సౌజన్య, నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 51, టమాటా 48, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 24, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 44, బీరకాయలు 44, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 22, క్యారెట్ 40 దొండకాయలు 42, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 85, బరబటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 36, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 66, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

నిలిచిన బీఆర్‌టీఎస్ పనులు

» సింహాచలం కారిడార్‌లో స్తంభించిన నిర్మాణం
» ఎక్కడి యంత్రాలు అక్కడే » గతుకుల రోడ్డుతో స్థానికుల అవస్థలు
» కనీస స్పందన లేని జీవీఎంసీ అధికారులు, కాంట్రాక్టర్

సింహాచలం, సెప్టెంబరు 30 : జీవీఎంసీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ పనులు గత కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. తొలిపావంచా నుంచి పాత అడివివరం కూడలి వరకు జరుగుతున్న ఈ పనులను గత ఏడాది నవంబరులో ప్రారంభించారు. ఈఏడాది మే నెలలో జరిగిన సింహాద్రినాథుని నిజరూప దర్శనం చందనోత్సవం, జూలైలో జరిగిన గిరిప్రదక్షిణ ఉత్సవాల నేపథ్యంలో పనులను పరుగులు పెట్టించారు. ఆగస్టు నుంచి నత్తనడకన సాగిన పనులు ప్రస్తుతం పూర్తిగా స్తంభించాయి.యంత్రాలను దేవస్థానం బస్టాండ్‌లో నిలిపివేశారు. పనుల నిలిపివేతతో ఆస్పత్రి, ఆర్‌టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గాలతో పాటు గ్రామంలోని ఇతర వీధులను ప్రధాన మార్గానికి కలిపే లింక్ రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తాత్కాలికంగా నిర్మించిన లింక్ రోడ్లు చాలావరకు పాడయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లే రోగులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇటీవల జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో స్థానిక కార్పొరేటర్ పివి నరసింహం ఈ అంశంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినప్పటికీ అధికారుల్లో గాని, కాంట్రాక్టర్‌లో గాని కనీస స్పందన లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద నిలిపివేసిన యంత్రాలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

» వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, సెప్టెంబరు 30 : వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉన్న పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆ సంస్థ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం, వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్ ఆవరణలో క్రీడా ప్రాంతాలను పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పచ్చదనం పెంపొందించాలని చెప్పారు. ఆయనతో పాటు జాయింట్ కమిషనర్ రమేష్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, బలరామ రాజు, రామరాజు ఉన్నారు.



క్రీడా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కరించండి

» మంత్రి నారాయణకు ఎమ్మెల్యే వెలగపూడి వినతి

ఎంవీపీకాలనీ, సెప్టెంబరు 30 : తూర్పు నియోజకవర్గం పరిధిలోని 9 నుంచి 13వ వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాలకు మంచినీటి సరఫరా ఆశించిన స్థాయిలో జరగడం లేదని, కొత్తగా ప్రాజెక్టు మంజూరు చేయాలని మునిసిపల్ శాఖా మంత్రి నారాయణను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. సోమవారం ఆయన అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ గోదావరి, తాటిపూడి నీటిని పంపింగ్ ద్వారా ఆయా ప్రాంతాలకు పంపించడానికి దూరాభారం కావడంతో కొండవాలు ప్రాంతీయులు తాగునీటికి పలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆ ఐదు వార్డుల పరిధిలో సుమారు 1.50 లక్షల నుంచి 1.70 లక్షల మంది జనాభా నివశిస్తున్నారని, ఆరిలోవ, హనుమంతువాక, విశాలాక్షినగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలకు టౌన్ సర్వీస్ రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోందని వివరించారు. దీనివల్ల సరఫరాలో ఆలస్యం, తక్కువ పరిమాణంలో సరఫరా, మూడుచోట్ల పంపింగ్ వల్ల విద్యుత్ సమస్యలు, మోటార్ల మరమ్మతు పరిపాటిగా మారాయని చెప్పారు. వేసవిలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిందిగా మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వెలగపూడి తెలిపారు.



మంత్రి నారాయణకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

2న బీజేపీ కార్యాలయంలో ఖాదీ ప్రదర్శన

పెదవాల్తేరు, సెప్టెంబరు 30 : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం, మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఈనెల 2న నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఖాదీ సంత ఏర్పాటు చేయనున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, రాష్ట్ర కోశాధికారి ఎం. నగేంద్ర తెలిపారు. సోమవారం వారు పార్టీ కార్యాలయంలో ఖాదీ సంత ఏర్పాటుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛభారత్, చేనేత, ఖాదీ, చేతి కళలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు చేనేత కార్మికులను ప్రోత్సహించడానికి ఖాదీ సంత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాశ్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎన్. విజయేంద్రరెడ్డి, జీసీ నాయుడు, శ్రీరంగం ధనేశ్వరరావు, కొప్పల రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'సభ్యత్వాల నమోదులో అగ్రస్థానంలో నిలపాలి'



మాట్లాడుతున్న గంటా రవితేజ

భీమునిపట్నం, సెప్టెంబరు 30 : టీడీపీ సభ్యత్వాల నమోదులోనూ భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని పార్టీ యువ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. సోమవారం తపస్వ ఫంక్షన్ హాల్‌లో పార్టీ సభ్యత్వాల నమోదుపై నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త ముందడుగు వేయాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు చేసే విధానాలను ఐటీడీపీ నాయకులు వివరించారు. ఈ సమావేశంలో నాయకులు పిల్లా వెంకటరావు, గాడు వెంకటప్పడు, రాజు, గాడు చిన్నికుమారిలక్ష్మి, మొల్లి లక్ష్మణరావు, గంటా నూకరాజు, దాసరి శ్రీనివాస్, కళిరెడ్డి దామోదరరావు, వై. జీవన్ కుమార్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు మరుపిళ్ళ రాజేంద్రప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సూరాడ రవి, వానపల్లి సత్య, సూరాడ నరసింగరావు, మారుపల్లి అమరనాథ్, మహంతి శివాజీ, కురిమిన లీలావతి, కొప్పల కృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆనందపురం, సెప్టెంబరు 30 : మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను కోరారు. సోమవారం ఆయన తహసీల్దార్ శ్యామ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన జగనన్న భూసర్వేలో అవకతవకలు జరిగాయన్నారు. చాలామంది రైతులకు అన్యాయం జరిగిందని, దీనిపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదని చెప్పారు.అనంతరం ఆయన సీఐ చింతా వాసునాయుడు, ఎంపీడీవో జానకిని కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, నాయకుడు గోవింద్ బాలు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 30 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జీవీఎంసీ సస్టైనబుల్ రిజిలియన్స్ యూనిట్ ప్రాజెక్టు ఇంజనీర్ వివేక్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన యూత్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం చాలా అవసరమని చెప్పారు. వ్యాస్ ఎన్‌జీవో, ఆస్ట్రేలియన్ కాన్సలేట్ జనరల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపాల్ జగదీశ్, వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి రాణీప్రియాంక, ఎకో వారియర్ జేవీ రత్నం, పర్యావరణ వాలంటీర్లు రవితేజ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

సిరిపురం, సెప్టెంబరు 30 : తొలగించిన తాత్కాలిక ఉద్యోగులకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించి అప్పటి సర్వీసులను కలపాలని ఆలిండియా ఎల్ఐసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. ముత్యాలు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎల్ఐసీ ఉద్యోగులు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ, నెల్లూరు ఎల్ఐసీ ఆఫ్ ఇండియా డివిజన్‌లో 1993 నుంచి 1997 వరకు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా నియమించబడి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకొని రెగ్యులర్ చేయాలన్నారు. ఈ విషయమై వచ్చే నెల 4 వరకు నిరసనలు చేపడతామని చెప్పారు.

ఎండాడలో కూటమి నాయకుల దీపారాధన

ఎండాడ, సెప్టెంబరు 30 : టీటీడీ లడ్డూ వివాదం నేపథ్యంలో ఎండాడ బీసీ కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయ ఆవరణలో జనసేన 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం దీపారాధన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి విష్ణు, శంఖు, చక్ర నామాల ఆకారంలో దీపాలు అలకరించి దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్టుపల్లి గోపి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

'దాతలు ఆదుకోవాలి'



మద్దిల రాణి

భీమునిపట్నం, సెప్టెంబరు 30 : చిన్నతనం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అభాగ్యురాలు మద్దిల రాణి (21)ని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. రాణి స్థానిక నూకాలమ్మ గుడి ప్రాంతం బోయవీధిలో నివసిస్తోందని, ఆమె తండ్రి శ్రీను 25 ఏళ్లకుపైగా ఫొటో స్టూడియోలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారని చెప్పారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు కాగా పెద్దమ్మాయి రాణి పుట్టికతోనే అనారోగ్యంతో బాధపడుతోందని, ప్రస్తుతం 21 ఏళ్లు వచ్చినా.. ఎదుగుదల లేకపోవడం, ఇటీవల తరచూ కడుపు పొంగిపోతుండడంతో నానా ఇబ్బంది పడుతుందన్నారు. కుమార్తెను బతికించుకోవాలన్న తపనతో తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆమెకు వైద్యం చేయిస్తున్నారని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం వారు దాతల సహాయం కోరుతున్నారని, వివరాలకు 9849618616 సెల్ నంబరును సంప్రతించాలని ఆయన కోరారు.

స్కూల్ గేమ్స్‌లో తాటితూరు విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 30 : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిట్టివలసలో ఈనెల 23, 24వ తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపారు. షార్టుపుట్‌లో మొదటి బహుమతి, ఖోఖోలో రెండవ బహుమతి పొందారు. విజేతలను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం మురళి, తదితరులు అభినందించారు.

జాతీయ మాలఖంభ పోటీలకు గుడిలోవ విద్యార్థిని

ఆనందపురం, సెప్టెంబరు 30 : మండలంలోని గుడిలోవ సరస్వతీ విద్యావిహార్ విద్యార్థిని జాతీయ మాలఖంభ పోటీలకు ఎంపికైంది. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బి. హారిణి ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని చెలగావిలో 14 ఏళ్ల బాలికల విభాగంలో జరిగిన జోనల్‌స్థాయి మాలఖంభ పోటీల్లో నాల్గవ స్థానంలో నిలి చింది. ఈమేరకు నిర్వాహకులు ఆమెను నవంబరు 7 నుంచి 10 వరకు రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ జె. మాధురి తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్త



ఆలయ శిఖర దర్శనం చేస్తున్న శాస్త్రవేత్త హరప్రసాద్

సింహాచలం, సెప్టెంబరు 30 : డీఆర్‌డీఓకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త ఆర్‌వీ హరప్రసాద్ వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న శాస్త్రవేత్త గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలివ్వగా ఏఈఓ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

శిథిలావస్థలో గోస్తనీ వంతెన



పాడైన వంతెన రెయిలింగ్

పద్మనాభం, సెప్టెంబరు 30 : పద్మనాభం-శొంఠ్యాం రోడ్డులో గోస్తనీ నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వంతెన శ్లాబ్ పెచ్చులూడి గోతులు పడడంతో పాటు ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి.అలాగే ఇరువైపులా రక్షణ కోసం నిర్మించిన రెయిలింగ్ కూడా పూర్తిగా శిథిలమై ప్రమాద భరితంగా ఉంది. వంతెనపై వెళ్లేటప్పుడు వాహనదారులు, పాదచారులు నదీ ప్రవాహం వైపు చూసినప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వంతెన స్తంభాలకు మధ్య ఉన్న భాగం కూడా దెబ్బతిన్నది. ఈ వంతెనను 1987లో సుమారు రూ.36.56 లక్షలతో నిర్మించారు. 37 ఏళ్లుగా కనీస నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం ఈ దుస్థితి నెలకొంది.



జడ్సీ ప్రేమ ప్రసన్న వాణికి వినతి అందిస్తున్న ఫిర్యాదుదారులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 11 వినతులు

భీమునిపట్నం, సెప్టెంబరు 30 : పట్టణంలోని భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 11 వినతులు అందాయి. చిన్నబజారులో వున్న జమ్మి చెరువు ఉద్యానవనంలో ఓపెన్ జిమ్ పరికరాలు తుప్పుపట్టి పాడయ్యాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని జమ్మిచెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు జోగారావు తదితరులు జడ్సీ ప్రేమ ప్రసన్నవాణిని కోరారు. 2వ వార్డు బ్యాంక్ కాలనీలో ఉన్న రాయిపాలెం జీవీఎంసీ హైస్కూల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జనసేన నాయకుడు గుడివాడ కిరణ్ ఆధ్వర్యంలో ఆ పాఠశాల స్కూల్ కమిటీ ఛైర్మన్ గుడివాడ చిన్నారావు, ఉపాధ్యాయుడు ఆదిలక్ష్మి వినతి అందించారు. తగరపువలస జాతీయ రహదారిని అనుకొని వున్న వెంకటేశ్వర కొండ, బంగ్లామెట్ట కొండవాలు ప్రదేశంలో వర్షాల సమయంలో రాళ్లు పడిపోతున్నాయని, రక్షణ గోడ నిర్మించాలని ఆ వార్డు వైసీపీ నాయకులు అక్కరమాని రామునాయుడు, తమ్మిన కూర్మారావు విన్నవించారు. కాగా ఇంజనీరింగ్ విభాగానికి తొమ్మిది, పట్టణ ప్రణాళికా విభాగానికి, రెవెన్యూ విభాగానికి ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయని జడ్సీ తెలిపారు.

కళింగ తీరంలో స్వచ్ఛతా హీ సేవ

భీమునిపట్నం, సెప్టెంబరు 30 : భీమిలి బీచ్‌రోడ్ ఐఎన్ఎస్ కళింగ తీరంలో సోమవారం నేవల్ స్టేషన్ భీమునిపట్నం, జీవీఎంసీ జోన్ వన్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛతా హీ భాగిదారి-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది తీరంలో ఉన్న వ్యర్థాలను తొల గించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి జడ్సీ ప్రేమ ప్రసన్నవాణి, నేవల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

పద్మనాభం, సెప్టెంబరు 30 : వ్యక్తిని హత్యాయత్నం చేసిన కేసులో సోమవారం ముగ్గురిని అరెస్టు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం..పాత కొవ్వాడ గ్రామానికి చెందిన తమటపు నారాయణమూర్తి పోస్టల్ శాఖలో పనిచేస్తూ పార్ట్ టైంగా ఒక పత్రికలో విలేఖరిగా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి పెంట గ్రామంలోని తన అత్తవారి ఇంటికి వచ్చారు. 10 గంటల సమయంలో బైక్‌పై ఇంటికి బయలుదేరుతున్న సమయంలో అప్పటికే సమీపంలో అదును కోసం కాపు కాసి ఉన్న పెంట గ్రామానికి చెందిన డి.పైడిరాజు, డి.గణేష్, రమణమ్మ, బి.చంద్రశేఖర్ ఆయనపై కత్తితో దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించారు. ఈ దాడిలో బాధితుడి తలపై గాయాలయ్యాయి. ఆయన గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు రాగా నిందితులు పరారయ్యారు. నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీధర్ కేసు దర్యాప్తు చేశారు. ఘటనకు కారణమైన పైడిరాజు, గణేష్, చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వృద్ధురాలి కడుపులో 8 కిలోల కణితి తొలగింపు



విలేకరులతో మాట్లాడుతున్న ఒమేగా ఆస్పత్రి వైద్యులు

ఆరిలోవ, సెప్టెంబరు 30 : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలి కడుపులో ఉన్న ఎనిమిది కిలోల కణితిని తొగించినట్టు ఒమేగా ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సోమవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వృద్ధురాలు ఏ. లక్ష్మి ఒమేగా ఆసుపత్రికి రాగా వైద్యులు పరీక్షించి, కడపులో గడ్డ ఉన్నట్టు గుర్తించారు. ఈమేరకు ఈనెల 23న శస్త్ర చికిత్స ద్వారా గడ్డను తొలగించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఈ శస్త్ర చికిత్స చేశామని, ప్రస్తుతం రోగి ఆరోగ్యం బాగుందని వైద్యులు తెలిపారు. విలేకరుల సమావేశంలో వైద్యులు మురళీధర్, శ్రీహర్ష, శ్రుతి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 30 : మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన ఎస్. నీలయ్య (45) భార్య జయలక్ష్మి, పిల్లలతో అగనంపూడి దరి కొండయ్యవలసలో నివాసముంటున్నారు. పనులు లేక నీలయ్యకు కుటుంబ పోషణ భారమైంది. దీంతో మనస్తాపంతో మద్యం తాగిన అయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డారు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర కారాగారంలో నాని సినిమా షూటింగ్

ఆరిలోవ, సెప్టెంబరు 30 : కేంద్ర కారాగారంలో ఆదివారం సాయంత్రం నాని హీరోగా నటిస్తున్న హిట్-3 సినిమా షూటింగ్ జరిగింది. జైలులో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించినట్టు అధికారులు తెలిపారు. నాని పోలీసు అధికారిగా జైలులో ఖైదీతో మాట్లాడిన సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈనెల 5వ తేదీన మళ్లీ జైలులో షూటింగ్ ఉంటుందని అధికారులు చెప్పారు.

కార్ల ప్రమాదంపై కేసు నమోదు

భీమునిపట్నం, సెప్టెంబరు 30 : బీచ్‌రోడ్‌లో గోవుపేట జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన కార్ల ప్రమాదంపై కేసు నమోదు చేశామని సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపారు. నగరం నుంచి అతివేగంగా వస్తున్న రెండు కార్లు గోవుపేట జంక్షన్ వద్ద ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో రహదారి పక్కన పార్కింగ్ చేసి ఉన్న రెండు బైక్‌లు పాడయ్యాయి. అలాగే సెంట్రల్ లైటింగ్ స్తంభం కూడా నేలకొరిగింది. రెండు కార్లలో ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయగా మీసాల వెంకట్ మద్యం సేవించినట్టు నిర్ధారణ కావడంతో అతనిపై కేసు నమోదు చేశారు.

గంజాయి కేసులో నిందితుడి పరారీ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 30 : పోలీసులు కళ్లు కప్పి గంజాయి నిందితుడు పరారైన సం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి.. సెప్టెంబరు 28వతేదీన ముందస్తు సమాచారంతో దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద కాపు కాసిన టాస్క్‌ఫోర్సు పోలీసులు ఏఎస్ఆర్ జిల్లా పెదబయలుకు చెందిన అరడా శివకుమార్, ఓ బాలుడిని అదుపులోకి తీసుకుని తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయి, బైకును స్వాధీనం చేసుకుని దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అదే రోజు అర్ధరాత్రి సమయంలో స్టేషన్‌లో శివ కుమార్ పోలీసుల కళ్లు కప్పి పరారయ్యాడు. దీంతో పోలీసులు మూడు బృందాలుగా నిందితుడి కోసం గాలిస్తున్నా ఆచూకీ తెలియలేదు. బాలుడిని జ్యువెనల్ హోమ్‌కు తరలించారు.

ఉపాధి పనుల పరిశీలన



అయినాడ పంచాయతీ భవనం వద్ద కేంద్ర బృందంతో అధికారులు

పద్మనాభం, సెప్టెంబరు 30 : మండలంలోని పలు పంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టిన శాశ్వత నిర్మాణాలను కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. పంచాయతీ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, ఉద్యానపంటల పెంపకం, గృహ నిర్మాణంలో స్వయం సహాయక సంఘాల పాత్ర, భూమి రికార్డుల పరిశీలన తదితర కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబాల్కర్, జిల్లా బృందం సభ్యులు డీపీఎం సంజయ్, వైదేహి, ఏపీఎం ఆదినారాయణ, ఎంపీడీఓ విజయకుమార్, ఈఓఆర్డీ కుమార్, వెలుగు ఏపీఎం ప్రభాకర్, సర్పంచ్ ఆరం జ్యోతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.